


# ప్రజావీక్షణం

దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

PJV
ప్రజా వీక్షణం టీవి
Subscribe

www.prajaveekshanam.in సంపుటి:16 సంచిక :196 09 మంగళవారం, జూన్ 2026 పేజీలు : 12 వెల:రూ.2/-

Published from : Vijayawada, Krishna, Guntur, Kakinada, Vishakhapatnam, Vijayanagaram, Prakasham, Kadapa, Kurnool, Tirupathi, Anantapur, East Godavari, West Godavari

# బొగ్గు దిగుమతులను తగ్గించేయత్నం

- బొగ్గు ఉత్పత్తిలో స్వయం సమృద్ధి దిశగా భారత్
- మైనింగ్, కోల్ రంగాల్లో విప్లవాత్మక మార్పులు
- ప్రస్తుతం 189 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు
- గత 12 ఏళ్లుగా ప్రధాని మోడీ నిరంతర కృషితో పురోగతి
- కోల్ రంగంలో సంస్కరణలతో ఐదులక్షల మందికి ఉపాధి
- క్రిటికల్ మినరల్స్ కోసం అర్జెంటీనాతో ఒప్పందం
- కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి



హైదరాబాద్,జూన్8 (ప్రజా వీక్షణం)

క్రమంగా విదేశాల నుంచి బొగ్గు దిగుమతులను తగ్గించే పనిలో ఉన్నామని కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. నూతన భారత నిర్మాణంలో బొగ్గు రంగం కీలక పాత్ర పోషిస్తోందని కిషన్‌రెడ్డి అన్నారు. ప్రతి వారం బొగ్గు ఉత్పత్తి, సరఫరాపై ప్రధాని మోదీ పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌లో మీడియాతో కిషన్‌రెడ్డి మాట్లాడారు. గతంలో రూ.1.89లక్షల కోట్ల బొగ్గు కుంభకోణం జరిగిందని కాగ్ నివేదిక ఇచ్చింది. కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన కోల్ మైన్స్‌ను సుప్రీంకోర్టు రద్దు చేసింది.

వివరాలు 2లో



# సంక్షేమ రాజ్య నిర్మాణం..
# ప్రజాప్రభుత్వ లక్ష్యం



- తెలంగాణలో 'నాలెడ్జ్' విప్లవం
- రూ.110 కోట్లతో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్
- రూ..25 కోట్లతో ఎస్సీ హాస్టల్ పునరుద్దరణ
- ఉద్యోగాల నోటిఫికేషన్లతో పాటు ఉచిత డిజిటల్ కోచింగ్
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి

హైదరాబాద్,జూన్8 (ప్రజా వీక్షణం)

ప్రజా ప్రభుత్వం తెలంగాణలో సంక్షేమ రాజ్యం నిర్మించేదిశగా కృత నిశ్చయంతో పనిచేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మరోసారి స్పష్టం చేశారు. లోయర్ ట్యాంక్ బండ వద్ద రూ.110 కోట్ల అంచనాలతో నిర్మించనున్న బాబాసాహెబ్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్, నింబోలి అడ్డా వద్ద రూ. 25 కోట్ల అంచనాలతో నిర్మించనున్న ఎస్సీ హాస్టల్ కు సబంధించి స్థల పరిశీలన అనంతరం ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఈ రెండు భవనాలకు సంబంధించి ఆర్థిక, పాలనపారమైన అనుమతులు మంజూరయ్యాయని భట్టి విక్రమార్క తెలిపారు.

వివరాలు 2లో

# పెళ్లికి ముందే శారీరక సంబంధాలు

- ఇది మోసపూరితమని చెప్పలేం
- పరస్పర అంగీకారంతోనే జరిగినట్లు గుర్తించాల్సిందే
సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ,జూన్8 (ప్రజా వీక్షణం)

పెళ్లికి ముందు శారీరక సంబంధాలపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. పెళ్లికి ముందు పరస్పర అంగీకారంతో ఏర్పడిన శారీరక సంబంధాల ఆధారంగా ఒక వ్యక్తి వ్యక్తిత్వం లేదా నడవడికను ప్రశ్నించలేమని అత్యున్నత న్యాయ స్థానం వ్యాఖ్యానించింది. ప్రేమ సంబంధాలు అన్నీ వివాహానికి దారితీయవని తెలిపింది.

వివరాలు 2లో



# వెటర్నరీ ఆస్పత్రిని ప్రారంభించిన - మంత్రి తుమ్మల



ఖమ్మం,జూన్8 (ప్రజా వీక్షణం)

జిల్లాలోని వి. వెంకటాయపాలెంలో వెటర్నరీ ఆసుపత్రిని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... వెంకటాయపాలెం గ్రామానికి జిల్లాలో ఓ చరిత్ర ఉందన్నారు. ఎన్టీరామారావుతో ఈ గ్రామానికి వచ్చి ఇక్కడే భోజనం చేసినట్లు ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఇక్కడ భూగర్భ జలాలు లేకపోతే లిఫ్ట్ పెట్టమని అడిగితే, ఎన్టీ రామారావు ప్రభుత్వంలో లిఫ్ట్ ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం పెట్టాలని ప్రతిపాదన వచ్చినప్పుడు ఒక్కొక్కరూ ఒక్కోచోట పెట్టాలని కోరితే... వి.వెంకటాయపాలెంలో పెట్టినట్లు చెప్పారు. ప్రతి పని పదికాలాల పాటు ఉండేలా చేయించాలని మంత్రి అన్నారు. వెంకటాయపాలెం గ్రామాన్ని తన శక్తి మేరకు అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు. 'మనకు పని చేసే మంచి ఆర్డీవో వచ్చారు.. ఆయనతో భూమి సర్వే చేయించుకోండి' అని అన్నారు. ఇళ్ల స్థలాలు నిజమైన పేద వాళ్లకి ఎన్ని ఉంటే అన్ని ఇచ్చేయాలని అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు.

# ఎబోలా వ్యాప్తిపై

## ఆరోగ్య శాఖ అప్రమత్తం

- విదేశ్య ప్రయాణజకలు రాకపై ప్రత్యేక నిఘా- ఎబోలా లక్షనాలు ఉంటే గుర్తించి గాంధీకి తరలింపు- వ్యాధి లక్షణాలు ఉంటే సమాచారం ఇవ్వాల్సిందే
- అధికారులతో సమీక్షించిన వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర



హైదరాబాద్,జూన్8 (ప్రజా వీక్షణం)

కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ దేశాల్లో ఎబోలా వైరస్ వ్యాప్తి నేప థ్యంలో.. రాష్ట్రంలో చేపట్టిన ముందస్తు జాగ్రత్తలు, పర్యవేక్షణ చర్యలు, వివిధ శాఖల మధ్య సమ న్వయం, ఎమర్జన్సీ రెస్పాన్స్ సిస్టమ్, తదితర అంశాలపై ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సోమవారం సెక్రటే రియట్‌లో సమీక్ష చేశారు.

వివరాలు 2లో

# మహిళా సాధికారతలో మరో కీలక మలుపు



- మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సులు
- సిఎం రేవంత్ సమక్షంలో నేడు అందచేత

హైదరాబాద్,జూన్8 (ప్రజా వీక్షణం)

మహిళా సాధికారత కోసం తెలంగాణ ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సులు కేటాయించనుంది. మంగళవారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ బస్సులను మహిళా సంఘాలకు సీఎం రేవంత్ చేతుల మీదుగా పంపిణీ చేయనున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లపై సోమ వారం సచివాలయంలో మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ తోపాటు ఆర్టీసీ నిర్వహించారు.

వివరాలు 2లో



- సర్ ప్రక్రియతో లక్షలాది మంది ఓట్లు గల్లంతు
- రాజకీయ వేధింపులకు దర్యాప్తు సంస్థల దుర్వినియోగం
- ఇండియాకూటమి భేటీలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే

న్యూఢిల్లీ,జూన్8 (ప్రజా వీక్షణం)

ప్రధాని నరేంద్ర మోదీ పాలనతో భారతదేశం సమస్యల్లో పడిందని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ చీఫ్ మల్లికార్జున ఖర్గే అన్నారు. మోదీ హయాంలో రాజ్యాంగంపై నిరంతరం దాడులు జరుగుతున్నాయని.. బీజేపీ





యేతర రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతోందని మండిపడ్డారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ వేధింపులకు వాడుకుంటున్నారని ఆరోపించారు. సోమవారం ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో ఇండియా బ్లాక్ కూటమి పార్టీల నేతలు సమావేశమయ్యారు.

వివరాలు 2లో

# మోడీ పాలనతో చిక్కుల్లో దేశం

# ప్రజల భవిష్యత్ బాగు చేసే బాధ్యత ప్రభుత్వానిదే



- భూ సమస్యల పరిష్కారం కోసం బ్లాక్‌చైన్ టెక్నాలజీ
- క్యూఆర్ కోడ్‌తో రాజముద్ర కలిగిన పాస్ పుస్తకాలు జారీ
- ట్యాంపర్ చేయకుండా పకడ్బందీగా భూ రికార్డులు
- గత ప్రభుత్వ హయాంలో ప్రజల మధ్య చిచ్చు పెట్టారు
- గొడ్డలి పట్టే వారికి నాగలి పట్టే వారి బాధలు ఎలా తెలుస్తాయి
- ఆక్వా రైతుల సమస్యలను పరిష్కరిస్తున్నాం
- సిద్ధాంతంలో పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ
- సాగు,తాగునీటికి ఇబ్బంది లేకుండా చూస్తున్నామన్న చంద్రబాబు

భీమవరం,జూన్8 (ప్రజా వీక్షణం)

ప్రజల భవిష్యత్ బాగు చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. భూ సమస్యల పరిష్కారం కోసం బ్లాక్‌చైన్ టెక్నాలజీని తీసుకొచ్చామని సీఎం తెలిపారు. క్యూఆర్ కోడ్‌తో రాజముద్ర కలిగిన పాస్ పుస్తకాలు జారీ చేశామన్నారు. ఇప్పుడు రైతుల భూ రికార్డులను ఎవరూ ట్యాంపర్ చేయలేరని అన్నారు. సోమవారం సిద్దాంతంలో రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలను సీఎం పంపిణీ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. మంత్రి రామానాయుడికి అప్పగించామన్నారు.

వివరాలు 2లో

# పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు

## ఇరాన్‌ను వీడాలని భారత్ అడ్వైజరీ

న్యూఢిల్లీ,జూన్8 (ప్రజా వీక్షణం)

ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య మరోసారి తీవ్రస్థాయిలో దాడులు జరుగు తున్నాయి. దీంతో పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు నెల కొన్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో టెహ్రాన్‌లోని భారత ఎంబసీ అడ్వైజరీ జారీ చేసింది. తక్షణమే ఇరాన్‌ను వీడాలని అక్కడి భారత పౌరులకు సూచించింది. పశ్చిమాసియాలో నెలకొన్న తాజా పరిణామాల దృష్ట్యా ప్రస్తుతానికి భారత పౌరులు ఇరాన్‌కు ప్రయాణాలను మాను కోవాలని సూచి స్తున్నాం.

GENERAL NEWS

09 మంగళవారం, జూన్ 2026

2

www.prajaveekshanam.in

ప్రజావీక్షణం
దినపత్రిక

# ప్రజల భవిష్యత్ బాగు చేసే బాధ్యత ప్రభుత్వానిదే

మొదటిపేజీ తరువాయి

ఎప్పుడు చూసినా గోదావరి జిల్లా ఆహ్లాదకరంగా ఉంటుందన్నారు. పంటలు పండించడంలో జిల్లాల్లో రైతులకు మించిన వారు లేరని కొనియాడారు. రాయలసీమ, విశాఖ జిల్లాల్లో పరిశ్రమల కోసం భూములు కావాలంటే ఇస్తారని.. ఇక్కడ మాత్రం సెంటు భూమి కూడా ఇవ్వరని అన్నారు. ఆ రైతుల సంక్షేమం కోసం ఓ ప్రణాళిక రూపొందించనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ప్రశాంతంగా ఉండే ఈ జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో ప్రజల మధ్య చిచ్చు పెట్టారని.. గొడవలు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ప్రజల భూములను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టిందని మండిపడ్డారు. గొడ్డలి పట్టుకునే నాగలి పట్టుకున్న రైతు గుర్తుకు రాలేదని వ్యాఖ్యానించారు. 'మా భూమి మీద సైకో ఫొటో వేశారు. భూమి మీద.. ఫొటో సైకోది.. నిద్ర లేస్తూనే ఆయన మొహం చూడాల్సి వచ్చేది. జగన్ పిచ్చితనానికి ట్రీట్మెంట్ ఎక్కడ ఉందో తెలీదు. మీకేమైనా తెలిస్తే, ఆ అడ్రస్ ఆయనకు పంపుతాను' అంటూ సీఎం చంద్రబాబు సెటైరికల్ కామెంట్స్ చేశారు. రీసర్వేలో రైతులను భాగస్వాములను చేశామని చెప్పారు. 6,688 గ్రామాల్లో రీసర్వే నిర్వహించి భూ రికార్డులు అప్‌డేట్ చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు 26 లక్షల పాస్ పుస్తకాలను పంపిణీ చేశామన్నారు. నిషేధిత జాబితా 22ఏలో ఉన్న భూ సమస్యలు పరిష్కరిస్తామని పేర్కొన్నారు. రైతుల ఖాతాల్లో రూ.8వేల కోట్ల అన్నదాత సుఖీభవ నిధులు జమ చేశామని చంద్రబాబు వెల్లడించారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో రైతులకు నగదు చెల్లింపులు జరుగుతున్నాయన్నారు. త్వరలో ఆక్వా రైతుల సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. రాష్ట్రంలో భూ రికార్డుల సంస్కరణలు, రైతుల హక్కుల పరిరక్షణ, వ్యవసాయాభివృద్ధిపై కీలక వ్యాఖ్యలు చేశారు. గోదావరి జిల్లాల రైతులు దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా నిలిచాయని కొనియాడిన సీఎం.. ఈ ప్రాంత రైతులు భూమిని సమర్థంగా వినియోగించుకుని వ్యవసాయాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని ప్రశంసించారు. ఇప్పుడు రైతుల భూ రికార్డులను ఎవరూ ట్యాంపర్ చేయలేరని, భూ సమస్యల పరిష్కారం కోసం బ్లాక్ చైన్ టెక్నాలజీ తీసుకొచ్చాం సీఎం చెప్పుకొచ్చారు. భూమి రికార్డులను మరింత భద్రంగా ఉంచేందుకు ప్రభుత్వం ఆధునిక సాంకేతికతను వినియోగిస్తోంది. బ్లాక్‌చైన్ టెక్నాలజీ, క్యూఆర్ కోడ్‌లు, అధునాతన భద్రతా ఫీచర్లతో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను తీసుకొచ్చామన్నారు. కరెన్సీ నోట్లకు ఉండే భద్రతా ప్రమాణాల తరహాలో రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలను రైతులకు అందిస్తున్నాము. రీ-సర్వే, ఈ-కేవైసీ ప్రక్రియల అనంతరం మాత్రమే పాస్ పుస్తకాలు ముద్రిస్తున్నామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 6,688 గ్రామాల్లో రీ-సర్వే పూర్తి చేసి 26.46 లక్షల మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేసాము. ఇంకా 62.32 లక్షల పుస్తకాలు పంపిణీ చేయాల్సి ఉంది, నిర్ణీత గడువులోగా 90 లక్షల మంది భూ యజమానులకు పాస్ పుస్తకాలు అందజేయడమే లక్ష్యం. గత పాలనలో ఏర్పడిన సమస్యలను పరిష్కరించేందుకు మూడు సంవత్సరాల పాటు కృషి చేయాల్సి వచ్చింది. రెవెన్యూ శాఖలో సమూల మార్పులు తీసుకొస్తున్నాము. రీ-సర్వే 2.0 కింద ఇప్పటికే 1,836 గ్రామాల్లో తుది రికార్డ్ ఆఫ్ రైట్స్ పూర్తి చేసాం. అమ్మకం, బహుమతి, విభజన వంటి 9 లక్షల భూ లావాదేవీలకు 100 శాతం ఆటో మ్యుటేషన్ వ్యవస్థను అమలు చేస్తున్నాము. వారసత్వ హక్కుల బదిలీని సులభతరం చేస్తూ రూ.10 లక్షల లోపు ఆస్తులకు కేవలం రూ.100తో బదిలీ సౌకర్యం కల్పించాము. అంతకంటే ఎక్కువ విలువ గల ఆస్తులకు రూ.1,000 స్టాంప్ డ్యూటీ చెల్లిస్తే సరిపోతుంది' అని సీఎం చెప్పారు. అలాగే పాత భూ రికార్డుల డిజిటలైజేషన్ వేగంగా కొనసాగుతోందని.. 1బీ, అడంగల్, డీకేటీ, ఇనాం, సీలింగ్ రికార్డులను డిజిటల్ రూపంలోకి తీసుకువస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. వాట్సాప్ ద్వారా మ్యుటేషన్ దరఖాస్తు, ట్రాకింగ్ సౌకర్యం అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. 1.37 లక్షల ఎకరాల విలేజ్ సర్వీస్ ఇనాం భూములను 22ఏ జాబితా నుంచి తొలగించామని, 15 జిల్లాల్లోని 33,012 ఎకరాల షరతు గల పట్టా భూములపై ఆంక్షలను కూడా ఎత్తివేసినట్లు వెల్లడించారు. వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా నిలుస్తోందని సీఎం స్పష్టం చేశారు. అన్నదాత సుఖీభవ పథకం కింద మూడు విడతల్లో 46 లక్షల మంది రైతులకు రూ.8,985 కోట్లు జమ చేశామని, కేంద్ర ప్రభుత్వ సహాయంతో కలిపి ప్రతి రైతుకు సంవత్సరానికి రూ.20 వేల వరకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వంలో ధాన్యం అమ్మిన రైతులకు డబ్బులు రావడానికి నెలల తరబడి పట్టేదని, ప్రస్తుతం 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. గోదావరి డెల్టా ప్రాంతంలో కాలువలు, చెరువుల మరమ్మతులు సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు, ఆక్వా రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ఆక్వా చెరువులకు యూనిట్‌కు రూ.1.50కే విద్యుత్ అందిస్తున్నామని, దాణా ధరలు పెరగడంతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కేంద్రం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. సోయాబీన్ మీల్ దిగుమతులపై సుంకాలు తగ్గించాలని కేంద్రాన్ని కోరినట్లు వెల్లడించారు. ఆక్వా రంగం రాష్ట్ర, దేశ ఆర్థిక వ్యవస్థలకు కీలకమని పేర్కొన్న సీఎం, ఆ రంగానికి అన్ని విధాలా మద్దతు కొనసాగుతుందని హామీ ఇచ్చారు. ఆక్వా పరిశ్రమ నుంచి వచ్చే వ్యర్థాలను వినియోగించి న్యూట్రాస్యూటికల్ ఔషధాల తయారీకి అవకాశాలు ఉన్నాయని కూడా సూచించారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన లక్ష్యాలతో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# సంక్షేమ రాజ్య నిర్మాణం.. ప్రజాప్రభుత్వ లక్ష్యం

మొదటిపేజీ తరువాయి

ఈ భవనాలు కేవలం భౌతికంగా కనపడేటువంటి ఒక కట్టడాలు మాత్రమే కాదు.. వేలాదిమంది విద్యార్థుల విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి ఉపయోగపడే ఆధునిక దేవాలయాలని ఆయన అన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగ ˘ువతీ యువకుల కోచింగ్ కష్టాలను శాశ్వతంగా దూరం చేయాలన్నదే ప్రజా ప్రభుత్వ బలమైన సంకల్పమని ఆయన స్పష్టం చేశారు. ట్యాంక్‌బండ్ వద్ద నిర్మించ తలపెట్టిన 'డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్' స్థలాన్ని, ఆ తర్వాత కాచిగూడలోని 'నింబోలిఅడ్డా హాస్టల్' ప్రాంగణాన్ని సంక్షేమ శాఖా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఉప ముఖ్యమంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ ను ట్యాంక్‌బండ్ దగ్గర సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్, మరో 10 అంతస్తులతో నిర్మించనున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. అవతేకాక నింబోలిఅడ్డా వద్ద మూడు అంతస్తులతో హాస్టల్ భవనాల నిర్మాణం దళిత, నిరుపేద వర్గాల చిరకాల వాంఛ అని చెప్పారు. ఈ భవనాలను నిర్మించడం ద్వారా రాష్ట్రంలో జ్ఞానం పొందాలనుకునే అందరికీ పెద్ద ఎత్తున ఉపయోగపడతాయని చెప్పారు. ఈ భవనాల నిర్మాణంకు సంబంధించి ప్రతిపాదనలు పంపిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం తరఫున ˛÷నాన్స్ క్లియరెన్స్ చేసి పంపించడం జరిగిందన్నారు. నాలెడ్జ్ సెంటర్ లో స్టడీ సర్కిల్స్, డిజిటల్ లైబ్రరీ, కాన్ఫరెన్స్ హాల్స్ లో విజ్ఞానాన్ని పంచే అత్యుత్తమ వేదికలగా నిలుస్తాయనే అశాభవాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఇక్కడ నిర్వహించే కార్యకలాపాలను డిజిటల్ వ్యవస్థతో మారుమూల ప్రాంతాలకు చేర్చేలా బలమైన సాంకేతిక వ్యవస్థను అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తరువాత మేము చాలా స్పష్టంగా చెప్పాము.. రాష్ట్రంలోని ప్రతి శాసనసభ నియోజకవర్గంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నాలెడ్జ సెంటర్స్ ను నిర్మిస్తున్నట్లు ప్రకటించామని చెప్పారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు కోచింగ్ కోసం హైదరాబాద్ రాకుండా అక్కడే ప్రిపేరయ్యేలా ఇవి ఉండబోతున్నాయి. భవిష్యత్తులో ఆయా శాసనసభ నియోజకవర్గాల్లోనే, అక్కడే వాళ్లకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేస్తాం. బెస్ట్ ఆఫ్ ది బెస్ట్ లెక్చరర్స్ ఇక్కడి నుంచి పాఠాలు చెబుతుంటే.. ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులు ఉన్నచోటనుంచే కదలకుండా కోచింగ్‌ను పొందేలా ఈ సెంటర్లను ఇంటర్‌లింక్ చేస్తున్నట్లు చెప్పారు. నాలెడ్జ్ సెంటర్ కేవలం ఒక భవనం మాత్రమే కాదని, కోట్లాది మంది విజ్ఞానాన్ని పెంపొందించుకునే ఒక నిరంతర విద్యా వేదికగా ఆయన అభివర్ణించారు. కూలీ నాలీ చేసుకునే తల్లిదండ్రులు, వ్యవసాయం చేసుకునే కుటుంబాలు, మధ్యతరగతి చిన్న వ్యాపారుల పిల్లలు.. పోటీ పరీక్షల కోచింగ్ కోసం హైదరాబాద్ వచ్చి ఇక్కడ వసతి ఖర్చుల భారాన్ని మోయలేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం ముందుచూపుతో ఈ నిర్ణయం తీసుకుందన్నారు. కేవలం ఉద్యోగాల నోటిఫికేషన్లు ఇవ్వడమే కాకుండా, నిరుద్యోగులు ఆయా ఉద్యోగాలను సాధించేలా రాష్ట్రవ్యాప్తంగా ఉచిత కోచింగ్ సౌకర్యాన్ని ఈ నాలెడ్జ్ సెంటర్ ద్వారా అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని ఈ ప్రధాన సెంటర్ నుంచి బెస్ట్ లెక్చరర్స్ చెప్పే పాఠాలను.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని నియోజకవర్గాల్లో నిర్మించబోయే అంబేద్కర్ నాలెడ్జ సెంటర్ల ద్వారా ఆన్‌లైన్‌లో, డిజిటల్ వ్యవస్థ ద్వారా విద్యార్థులు నేరుగా వీక్షించేలా ఇంటర్‌లింక్ చేస్తున్నట్లు వివరించారు. ట్యాంక్‌బండ్ వద్ద నిర్మించే ఈ భవన సముదాయంలో స్టడీ సర్కిల్స్, డిజిటల్ లైబ్రరీ, అత్యాధునిక కాన్ఫరెన్స్ హాళ్లు ఉంటాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మేధావులతో ఇక్కడ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు.

# మోడీ పాలనతో చిక్కుల్లో దేశం

మొదటిపేజీ తరువాయి

మోదీ ప్రభుత్వంలో దేశం ఎదుర్కొంటున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక, విదేశాంగ విధాన సవాళ్లపై చర్చించారు. ఈ సందర్భంగా కూటమి పార్టీలను ఉద్దేశించి ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ప్రసంగించారు. దేశ ఆర్థిక పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉందని ఆయన అన్నారు. ఉద్యోగాల కల్పనకు అవసరమైన పెట్టుబడులు దేశానికి రావడం లేదని పేర్కొన్నారు. పలు రంగాల్లో ప్రైవేట్ గుత్తాధిపత్యాలు పెరుగుతున్నాయని తెలిపారు. మరోవైపు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ తో లక్షలాది మంది ప్రజలు ఓటు హక్కును కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఎస్ఎమ్ఈ రంగం తీవ్ర సంక్షోభంలో పడిందన్నారు. మోదీ ప్రభుత్వంలో పరీక్షల నిర్వహణ వైఫల్యాలతో యువత నష్టపోతున్నారని ఖర్గే చెప్పుకొచ్చారు. మూడేళ్ల క్రితం ఇండియా కూటమి ఏర్పడిందని, పార్లమెంటులో ఇటీవల దాని బలం ఏంటో అధికార పక్షం రుచి చూసిందన్నారు. లోక్‌సభలో మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన డీలిమిటేషన్ బిల్లును ఓడించేందుకు ఈ ఏడాది ఏప్రిల్ 17న కూటమి పార్టీలు దృఢంగా ఏకమయ్యాయని ఖర్గే ప్రశంసించారు. ఇప్పుడు ఆ స్ఫూర్తిని మరింత బలోపేతం చేసుకుని ముందుకు సాగాలన్నారు. దేశం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రతిపక్షం ఐక్యంగా ఉండాలన్నారు. కీలక సమావేశానికి 23 ప్రతిపక్ష పార్టీల నేతలు హాజరయ్యారు. వారిలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్, తేజస్వీ యాదవ్, మమతా బెనర్జీ, దీపాంకర్ భట్టాచార్య, మెహబూబా ముఫ్తీ, సుప్రియా సూలే, బ్రివన్ థోల్ తదితరులు ఉన్నారు. అయితే, కీలక భాగస్వాములైన డీఎంకే, ఆప్ పార్టీలు మాత్రం సమావేశానికి దూరంగా ఉన్నాయి.

# పెళ్లికి ముందే శారీరక సంబంధాలు

మొదటిపేజీ తరువాయి

ఇద్దరి మధ్య పరస్పర అంగీకారంతో ఏర్పడిన ప్రేమ బంధం తర్వాత వివాహంగా మారకపోయినా, దానిని మోసం లేదా నేరంగా పరిగణించలేమని స్పష్టం చేసింది. అలాగే, ప్రేమలో ఉన్న సమయంలో వివాహం చేసుకుంటామని భావించి శారీరక సంబంధం ఏర్పడినప్పటికీ, తర్వాత వివిధ కారణాల వల్ల పెళ్లి జరగకపోతే ప్రతి సందర్భంలోనూ అది మోసం చేసినట్లుగా భావించరాదని సుప్రీంకోర్టు పేర్కొంది. ఇద్దరి మధ్య సంబంధం ఏర్పడిన సమయంలో వివాహం చేసుకునే నిజమైన ఉద్దేశం ఉందా?, లేదా? అనే అంశాన్ని ఆయా కేసుల వారీగా పరిశీలించాల్సి ఉంటుందని న్యాయస్థానం సూచించింది. ఇద్దరి పరస్పర సమ్మతితో ఏర్పడిన సంబంధాలు, మోసపూరితంగా వివాహ వాగ్దానం చేసి ఏర్పడిన సంబంధాల మధ్య స్పష్టమైన తేడాను గుర్తించాల్సిన అవసరం ఉందని న్యాయస్థానం తెలిపింది. కేవలం సంబంధం వివాహానికి దారితీయలేదనే కారణంతో ఒకరిపై మరొకరు మోసపూరిత ఆరోపణలు చేయడం సరైన విధానం కాదని కోర్టు అభిప్రాయపడింది. ఈ తీర్పు వ్యక్తిగత స్వేచ్ఛ, పరస్పర అంగీకారం, ఆధునిక సామాజిక సంబంధాలపై న్యాయవ్యవస్థ దృక్పథాన్ని ప్రతిబింబిస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# బొగ్గు దిగుమతలును తగ్గించేయత్నం

మొదటిపేజీ తరువాయి

ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక బొగ్గు రంగంలో కీలక సంస్కరణలు తీసుకొచ్చాం అన్నారు. ప్రస్తుతం 189 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. గతంలో బొగ్గును చైనా, ఆస్ట్రేలియా, ఇండోనేషియా నుంచి దిగుమతి చేసుకునేవాళ్లం. అయితే ఇప్పుడు ఇతర దేశాల నుంచి బొగ్గు దిగుమతి తగ్గించే ప్రయత్నం చేస్తున్నాం అని వివరించారు. అండర్‌గ్రౌండ్ కోల్ గ్యాసిఫికేషన్‌పై అధ్యయనం చేస్తున్నాం. ఈనెల 11న ప్రైవేట్ కంపెనీలతో చర్చిస్తాం. 2028 నాటికి అన్ని కోల్ బ్లాక్స్ మూసేస్తాం. క్రిటికల్ మినరల్స్ మిషన్ ప్రయోగానికి రూ.1,500 కోట్లు కేటాయించాం. 24 క్రిటికల్ మినరల్స్‌ను దిగుమతి చేసుకుంటున్నాం. అర్జెంటీనాలో 6 క్రిటికల్ మినరల్స్ బ్లాక్స్ తీసుకున్నాం అని కిషన్‌రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం గత 12 సంవత్సరాలుగా దేశ అభివృద్ధి కోసం అనేక కీలక సంస్కరణలు అమలు చేసిందని కిషన్ రెడ్డి తెలిపారు. ముఖ్యంగా మైనింగ్, కోల్ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చామని ఆయన పేర్కొన్నారు. గతంలో బొగ్గు రంగం అవినీతి, అక్రమాలు, అరకొర నిధులతో ఇబ్బందులు ఎదుర్కొనేదని, కానీ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఈ రంగం పూర్తిగా రూపాంతరం చెందిందన్నారు. కోల్ రంగంలో సంస్కరణల ఫలితంగా దేశవ్యాప్తంగా సుమారు ఐదులక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించామని కిషన్ రెడ్డి వెల్లడించారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో బొగ్గు కేటాయింపుల వ్యవహారంలో అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయని.. అప్పటి కేంద్ర బొగ్గు మంత్రి జైలుకు వెళ్లిన పరిస్థితులు ఏర్పడ్డాయని గుర్తు చేశారు. ప్రస్తుతం కోల్ రంగం పారదర్శకంగా, సమర్థవంతంగా పనిచేస్తోందని అన్నారు. ప్రపంచంలో బొగ్గు వినియోగంలో చైనా తర్వాత భారత్ రెండో స్థానంలో ఉందని, దేశ విద్యుత్ ఉత్పత్తిలో 72శాతం బొగ్గుపైనే ఆధారపడి ఉందని మంత్రి వివరించారు. ఈ ఏడాది దేశం ఒక బిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి మైలురాయిని చేరుకుందని తెలిపారు. ప్రస్తుతం దేశ అవసరాలకు సరిపడేలా 80 రోజుల బొగ్గు నిల్వలు అందుబాటులో ఉన్నాయని, విద్యుత్ ఉత్పత్తికి ఎలాంటి అంతరాయం కలగకుండా కోల్ సంస్థలు పనిచేస్తున్నాయని చెప్పారు. స్టీల్, ఎరువుల పరిశ్రమలతో పాటు అనేక రంగాలకు బొగ్గు కీలక ముడి పదార్థమని పేర్కొన్న కిషన్ రెడ్డి, గతంలో విదేశాల నుంచి భారీగా బొగ్గు దిగుమతి చేసుకునే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు దేశీయ ఉత్పత్తి పెరగడంతో దిగుమతులు గణనీయంగా తగ్గాయని తెలిపారు. మైనింగ్ ప్రాంతాల్లో రైల్వే మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తూ రవాణా ఖర్చులు తగ్గించే చర్యలు చేపడుతు న్నామని చెప్పారు. క్రిటికల్ మినరల్స్ విషయంలో ప్రపంచవ్యాప్తంగా తీవ్ర పోటీ నెలకొందని, వాటి కోసం దేశాధినేతలను కూడా కిడ్నాప్ చేసే స్థాయికి పరిస్థితులు వెళ్లాయని ఆయన వ్యాఖ్యానించారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం భారత్‌కు ఒక పొరుగు దేశం కీలక ఖనిజాల సరఫరాను నిలిపివేసిందని తెలిపారు. ఈ నేపథ్యంలో క్రిటికల్ మినరల్స్‌లో స్వయం సమృద్ధి సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకెళ్తోందన్నారు. ప్రధాని మోదీ విదేశీ పర్యటనల్లో కూడా కీలక ఖనిజాల సరఫరాపై వివిధ దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారని చెప్పారు. కోల్ ఆధారంగా సింథటిక్ గ్యాస్ తయారీపై కూడా ప్రభుత్వం దృష్టి సారించిందని కిషన్ రెడ్డి వెల్లడించారు. అంతర్జాతీయంగా ఇరాన్, అమెరికా ఉద్రిక్తతల వంటి పరిస్థితుల వల్ల ఇంధన దిగుమతులపై ప్రభావం పడుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ వనరుల అభివృద్ధి అవసరమని అన్నారు. దేశంలో 187 బొగ్గు గనులు ఉన్నాయని, వినియోగం పూర్తయిన గనులను శాస్త్రీయ పద్ధతుల్లో మూసివేస్తున్నామని మంత్రి తెలిపారు. మూసివేసిన గనుల్లో పెద్ద ఎత్తున వృక్షారోపణ, పర్యాటక అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. ఈ గనులను ప్రపంచానికి ఆదర్శంగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తున్నామని, గిన్నిస్ బుక్ రికార్డుకు కూడా ప్రయత్నిస్తు న్నామని వెల్లడించారు. డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ నిధుల విషయంలో తెలంగాణ ప్రభుత్వంపై కిషన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. గనుల ప్రభావిత గ్రామాల అభివృద్ధికి 2శాతం నిధులు కేటాయించాలని చట్టం చేసినప్పటికీ, ఆ నిధులను జిల్లాలకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడం లేదని ఆరోపించారు. కలెక్టర్లను అడిగితే కూడా రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదనే సమాధానం వస్తోందని చెప్పారు. సింగరేణి కాలరీస్ వ్యవహారాలు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోనే ఉంటాయని పేర్కొన్న ఆయన, గతంలో డీఎంఎఫ్ నిధులను ఇతర అవసరాలకు మళ్లించారని విమర్శించారు.

# మహిళా సాధికారతలో మరో కీలక మలుపు

మొదటిపేజీ తరువాయి

మహిళల ఆర్థిక స్వావలంబనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా సీఎస్ రామకృష్ణారావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిట్టింగ్, తాగునీరు, మొబైల్ టాయిలెట్స్, భద్రత తదితర అంశాలపై ఉన్నతాధికారులకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు కీలక ఆదేశాలు జారీ చేశారు. దేశంలోనే మహిళా బస్సుల పథకం అతిపెద్ద స్థాయిలో అమలవుతున్న సంగతి తెలిసిందే. తెలంగాణ రైజింగ్-2047 లక్ష్యాల్లో భాగంగా మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోంది. అందులో భాగంగా వడ్డీ లేని రుణాలు, స్త్రీ నిధి, క్యాంటీన్లు, పెట్రోల్ బంకులతో మహిళలకు చేయూతను అందిస్తోంది. రాష్ట్ర మహిళా సాధికారత నమూనాను అధ్యయనం చేసేందుకు ఇతర రాష్ట్రాలు కూడా ఆసక్తిని కనబరుస్తున్నాయి. ఈ కార్యక్రమానికి వేలాదిగా మహిళలు హాజరు కానున్నారు. అందుకోసం ప్రభుత్వం భారీగా ఏర్పాట్లు చేస్తోంది. ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా ఈ పథకాన్ని దేశంలోనే ఇంత పెద్ద ఎత్తున అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని సిఎస్ పేర్కొన్నారు. మహిళల స్వావలంబన కోసం మహిళలకు వడ్డీ లేని రుణాలు, స్త్రీనిధి, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, పెట్రోల్ బంకుల నిర్వహణ, పాఠశాల విద్యార్థులకు యూనిఫాంల తయారీ తదితర పథకాల ద్వారా మహిళా సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున చేయూత నిస్తున్నదని అన్నారు. మహిళల కోసం తెలంగాణ రాష్ట్రం అమలు చేస్తున్న ఫథకాలను ఇతర రాష్ట్రాల్లో అమలు కోసం ఆయా రాష్ట్రాల అధికారులు అధ్యయనం చేసేందుకు ఇక్కడికి వస్తున్నారని సిఎస్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో సిఎం కార్యదర్శి మాణిక్ రాజ్, డీజీపీ సీవీ ఆనంద్, స్పెషల్ సిఎస్ లు వికాస్ రాజ్, నవీన్ మిట్టల్, దాన కిషోర్, రవాణా కమిషనర్ ఇలంబర్తి, సీఈఓ దివ్య, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుంద రెడ్డి, అశోక్ రెడ్డి, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక అలా, ప్రోటోకాల్ డైరెక్టర్ హరీష్, తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఎబోలా వ్యాప్తిపై ఆరోగ్య శాఖ అప్రమత్తం

మొదటిపేజీ తరువాయి

ఎబోలా ప్రభావిత దేశాల నుంచి రాష్ట్రానికి వచ్చే దేశ, విదేశీ ప్రయాణికులపై ప్రత్యేక నిఘా కొనసాగుతున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. శంషాబాద్ విమానాశ్రయంలో అమలులో ఉన్న స్క్రీనింగ్, సర్వైలెన్స్ వ్యవస్థలను మరింత బలోపేతం చేశామని తెలిపారు. ప్రభావిత దేశాల నుంచి వచ్చిన ప్రయాణికుల వివరాలను సేకరించి, వారి ఆరోగ్య పరిస్థితిని 21 రోజుల పాటు నిరంతరం పర్యవేక్షిస్తున్నామని వివరించారు. అనుమానిత లక్షణాలు కనిపించిన వారిని వెంటనే గుర్తించి, గాంధీ హాస్పిటల్‌లో ఐసోలేషన్‌లో ఉంచుతున్నామని తెలిపారు. ఇప్పటివరకూ ఇద్దరు అనుమానితులను గాంధీలో ఐసోలేషన్‌లో ఉంచి, వారి సాంపిల్స్‌ను టెస్టుల కోసం పూణెలిలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపించగా.. అక్కడ చేసిన టెస్టుల్లో వారి ఇద్దరికీ వైరస్ నెగిటివ్ వచ్చిందని మంత్రికి వివరించారు. సీఎంఆర్ సూచన మేరకు వారి సాంపిల్స్‌ను మరోసారి సేకరించి టెస్టుల కోసం పూణెలిలోని ఎన్ఐవీకి పంపించామని చెప్పారు. రెండోసారి నెగిటివ్ వస్తే, వారిని ఐసోలేషన్‌లో నుండి డిశ్చార్జ్ చేస్తామన్నారు. అనుమానిత సాంపిల్స్ సేకరణ, టెస్టులు చేయడంలో ఎలాంటి అలసత్వం ఉండకూడదని మంత్రి సూచించారు. ఆరోగ్యశాఖకు అవసరమైన సహకారం అందించాలని సీసీఎంబీ డైరెక్టర్‌ను మంత్రి కోరారు. ఐసీఎంఆర్ నుంచి ఎబోలా టెస్టింగ్ కిట్లు వచ్చాయని, టెస్టులు చేయడం ప్రారంభించామని సీసీఎంబీ డైరెక్టర్, డాక్టర్ వినయ్ నందికూరి తెలిపారు. సాంపిల్ వచ్చిన వెంటనే టెస్టులు చేసి, ఆరోగ్యశాఖ అధికారులకు సమాచారం ఇస్తామని ఆయన వివరించారు. విదేశాల నుంచి వచ్చే కొంత మంది ప్రయాణికులు తమకు ఇచ్చిన అడ్రస్‌లో ఉండడం లేదని అధికారులు మంత్రికి తెలిపారు. ఈ అంశంపై మంత్రి సీరియస్‌గా స్పందించారు. ఎబోల ప్రభావిత దేశాల నుంచి వచ్చే ప్రయాణికులు తమ చిరునామా, ఫోన్ నంబర్ తదితర వివరాలను కచ్చితంగా, సక్రమంగా అందించాల్సిందేనని మంత్రి స్పష్టం చేశారు. తప్పుడు వివరాలు అందించడం లేదా వాస్తవాలను దాచిపెట్టడం వంటి చర్యలను తీవ్రంగా పరిగణించాలని అధికారులకు సూచించారు. తప్పు సమాచారం ఇచ్చే వారిపై ఎపిడెమిక్ డిసీజెస్ యాక్ట్ సహా వర్తించే చట్టాల ప్రకారం కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. తప్పుడు సమాచారం అందించినట్లయితే చట్టపరమైన చర్యలు, కేసుల నమోదు వంటి పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందనే విషయాన్ని శంషాబాద్ విమానాశ్రయంలోనే ప్రయాణికులకు స్పష్టంగా తెలియజేయాలని మంత్రి సూచించారు. విదేశీ ప్రయాణికులతో సమర్థవంతంగా కమ్యూనికేట్ చేసేందుకు ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ సహకారం తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఎబోలా ప్రభావిత దేశాల్లో ఎక్కువగా మాట్లాడే ఫ్రెంచ్, అరబిక్, స్వాహిలి సహా అవసరమైన విదేశీ భాషల్లో మాట్లాడగల సిబ్బందిని మూడు షిఫ్టుల్లో, 24 గంటలపాటు విమానాశ్రయంలో అందుబాటులో ఉంచి పర్యవేక్షణ, సమాచార సేకరణ పక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కాంటాక్ట్ ట్రేసింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఆరోగ్యశాఖ, జీహెచ్ఎంసీ, విమానాశ్రయ అధికారులు, పోలీసు శాఖ తదితర విభాగాల మధ్య సమన్వయాన్ని పెంచాలని మంత్రి ఆదేశించారు.

## జంగారెడ్డిగూడెంలో కలకలం: బ్యాంక్ ఆఫ్ బరోడాలో

# బంగారం మాయం..

# ఆందోళనలో ఖాతాదారులు!






**జంగారెడ్డిగూడెం జూన్ 8(ప్రజా వీక్షణం)**

స్థానిక బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖలో బంగారం మాయమవ్వడం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. శనివారం ముగ్గురు ఖాతాదారులకు సంబంధించిన బంగారు ఆభరణాలు బ్యాంకు లాకర్ల నుండి మాయమైనట్లు వెలుగు చూడటంతో, మిగిలిన ఖాతాదారుల్లో తీవ్ర భయాందోళనలు మొదలయ్యాయి. తమ బంగారం సురక్షితంగా ఉందో లేదో తెలుసుకునేందుకు సోమవారం ఉదయం నుంచే ఖాతాదారులు పెద్ద ఎత్తున బ్యాంకు వద్దకు చేరుకున్నారు. బ్యాంకు తెరుచుకోక ముందే వందలాది మంది బాధితులు, ఖాతాదారులు కార్యాలయం బయట క్యూ కట్టారు. తమ జీవితకాల కష్టాన్ని బ్యాంకులో దాచుకుంటే, దానికి భద్రత కరువైందంటూ పలువురు ఖాతాదారులు ఆవేదన వ్యక్తం చేశారు. "మా బంగారం ఉందో లేదో చెప్పండి!" అంటూ ఖాతాదారులు బ్యాంకు అధికారులను నిలదీయడంతో అక్కడ కాసేపు తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. శనివారం రోజున బ్యాంకుకు వచ్చిన ముగ్గురు ఖాతాదారుల గోల్డ్ లోన్‌కు సంబంధించిన బంగారం మాయమైనట్లు అధికారులు గుర్తించారు. ఈ వార్త దావానలంలా వ్యాపించడంతో, సోమవారం ఉదయానికే వందలాది మంది ఖాతాదారులు బ్యాంకుకు పోటెత్తారు. నమ్మకానికి మారుపేరైన ప్రభుత్వ రంగ బ్యాంకులోనే ఇలాంటి ఘటన జరగడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం బ్యాంకు అధికారులు ఈ ఘటనపై అంతర్గత విచారణ జరుపుతున్నట్లు తెలుస్తోంది. పోలీసులు కూడా రంగంలోకి దిగి లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## మున్సిపల్ చైర్పర్సన్ సన్మానం చేసిన దేవస్థానం ఈవో శ్రీనివాస్

**దేవరకద్ర జూన్ 8 ప్రజా వీక్షణం**


దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలోని స్థానిక ఈశ్వర వీరప్పయ స్వామి ఆలయంలో మున్సిపల్ చైర్ పర్సన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి ప్రత్యేక పూజలు చేసిన అనంతరము దేవస్థానం ఈవో శ్రీనివాసులు వారిని శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. తదుపరి ఆలయ అర్చకులు నాగరాజు, నాగభూషణం, వారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది వారు తదితరులు పాల్గొన్నారు.



## మీ భూమి - మీ హక్కు: అప్పలరాజుగుడెంలో రైతులకు పాస్‌బుక్కుల పంపిణీ

**టి. నర్సాపురం, జూన్ 08 (ప్రజా వీక్షణం):**

ఏలూరు జిల్లా టీ. నర్సాపురం మండలం అప్పలరాజుగుడెం పంచాయతీలో 'మీ భూమి – మీ హక్కు' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల రెవెన్యూ అధికారి (ఎమ్మార్వో) సాయిబాబుతో కలిసి తెలుగుయువత పోలవరం నియోజకవర్గ అధ్యక్షులు గన్నిన సురేంద్రనాథ్ చౌదరి లబ్ధిదారులైన రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సురేంద్రనాథ్ చౌదరి మాట్లాడుతూ.. రైతుల భూ హక్కుల రక్షణకు, వారికి ప్రభుత్వ ఫలాలు సకాలంలో అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగుతోందని పేర్కొన్నారు. భూ సమస్యల పరిష్కారంలో రెవెన్యూ యంత్రాంగం కృషి అభినందనీయమన్నారు. ఎమ్మార్వో సాయిబాబు మాట్లాడుతూ.. రైతులు తమ భూములకు సంబంధించిన రికార్డులను పక్కాగా ఉంచుకోవాలని, ఎలాంటి సమస్యలున్నా నిబంధనల ప్రకారం పరిష్కరిస్తామని తెలిపారు. అలాగే ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, తెలుగుయువత నాయకులు, రెవెన్యూ సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.





## పాస్టర్ అబ్రహం కుమారుడి చిత్రపటానికి

### - మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు నివాళి

**కొయ్యలగూడెం:జూన్ 8(ప్రజా వీక్షణం)**

స్థానిక పాస్టర్ కడిమి అబ్రహం ద్వితీయ కుమారుడు కడిమి అశోక్ ఇటీవలే అకాల మరణం చెందిన సంగతి తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న పోలవరం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ తెల్లం బాలరాజు ఈరోజు కొయ్యలగూడెం గ్రామానికి విచ్చేసి, మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కడిమి అశోక్ చిత్రపటానికి పూలమాల వేసి ఆయనకు ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ కాసేపు మౌనం పాటించారు. శోకసప్తప్త కుటుంబ సభ్యులకు తెల్లం బాలరాజు తన గాఢ సానుభూతిని తెలియజేస్తూ, అధైర్యపడవద్దని ధైర్యం చెప్పారు.

ఈ పరామర్శ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేతో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు క్రైస్తవ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పాల్గొన్న వారిలో: గంజిమాల రామారావు కొయ్యలగూడెం మండలం ఎంపీపీ, దుర్గాప్రసాద్ ఏలూరు జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు, మారిశెట్టి శ్రీను కొయ్యలగూడెం మండలం బీసీ సెల్ అధ్యక్షుడు, వాసు మండల ప్రచార కమిటీ ప్రతినిధి, ఎల్లేటి భాస్కర్ కొయ్యలగూడెం టౌన్ యూత్ ప్రెసిడెంట్, పూలపల్లి రవి



కొయ్యలగూడెం టౌన్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్, అయ్యప్ప, దుర్గరాజు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కడిమి భర్త పోలవరం నియోజకవర్గం క్రైస్తవ సంఘం అధ్యక్షుడు,కడిమి నవీన్ బాబు కొయ్యలగూడెం మండలం క్రైస్తవ సంఘం సెక్రటరీ వీరితో పాటు కడిమి అశోక్ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు మరియు స్థానికులు ఈ కార్యక్రమంలో పాల్గొని అశోక్ స్మృతులను కొనియాడారు.

## ప్రతి వార్డు ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా

### - మున్సిపల్ చైర్ పర్సన్ దమయంతి

**దేవరకద్ర జూన్ 8 ప్రజావి క్షణం**

మున్సిపాలిటీలో ప్రతి వార్డును ఆదర్శవంతంగా తీర్చి దిద్దుతానని మున్సిపల్ చైర్పర్సన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి అన్నారు. సోమవారము దేవరకద్ర మున్సిపాలిటీలో ఘనంగా 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' సభలు నిర్వహించారు. దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలో 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' లో భాగంగా 4, 5, 6 మరియు 7వ వార్డులలో ప్రత్యేక వార్డు సభలను ఘనంగా నిర్వహించడం జరిగింది. మున్సిపల్ చైర్మన్ దమయంతి అధ్యక్షతన ఈ సభలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయా వార్డులలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ, వార్డుల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రణాళికలను రూపొందించారు. వార్డులలో మౌలిక వసతుల కల్పన, తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల మరియు వీధి దీపాల వంటి ప్రజా సమస్యలపై స్థానిక ప్రజల నుండి వినతులను స్వీకరించారు. మున్సిపల్ చైర్మన్ దమయంతి మాట్లాడుతూ. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రతి వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజల నుంచి వచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, వార్డు సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు, మహిళలు పాల్గొని సభలను విజయవంతం చేశారు. ఈ సభల, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.







## సమతుల్య ఎరువుల వినియోగంతో నేల ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చు

### - కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ విస్తరణ విభాగం శాస్త్రవేత్త అర్చన

**తాడేపల్లిగూడెం ప్రతినిది జూన్8 (ప్రజా వీక్షణం)**

సమతుల్య ఎరువుల వినియోగంతో నేల ఆరోగ్యం పరిరక్షించబడటంతో పాటు పంట దిగుబడులు, నాణ్యత మెరుగుపడతాయని కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ విస్తరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ కె.అర్చన సూచించారు. తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైయస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలోని కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఐసీఏఆర్-అటారి జోన్‌ ౫ పరిధిలోని దెందులూరు మండలంలోని కొవ్వలిలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఖరీఫ్2026 సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కె.వి.కె శాస్త్రవేత్త, డాక్టర్ అర్చన మాట్లాడుతూ భూసార పరీక్షల ప్రాముఖ్యత, వాటి వల్ల కలిగే ప్రయజనాలను రైతులకు తెలియజేయటంతోపాటు ప్రతి రైతు తమ పొలాల్లో తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. నేల పరీక్షల ఆధారంగా ఎరువులను వినియోగించటం ద్వారా రైతులకు ఖర్చులు తగ్గటంతోపాటు అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. గ్రీన్ మ్యాన్యూరింగ్ ద్వారా నేలలో సేంద్రియ కార్బన్ పెరిగి భూసారం మెరుగుపడుతుందని వివరించారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.




## ఆగిపోయిన అంబేద్కర్ భవన్ నిర్మాణాన్ని పూర్తి చేయాలి

### - నవతరం పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షులు ఎస్. కె.కరీం

**బాపట్ల : జూన్ 8 (ప్రజా వీక్షణం)**



బాపట్ల జిల్లా బాపట్ల నియోజకవర్గం కర్లపాలెం మండలంలో జాతీయ రహదారి పక్కన గత ఏడు సంవత్సరాల నుండి ఆగిపోయిన అంబేద్కర్ భవన్ నిర్మాణం పూర్తి చేయాలని కోరుతూ కర్లపాలెం మండలానికి చెందిన దళిత నాయకులు బోరుగడ్డ జీవన్ ప్రతి సోమవారం నిర్వహిస్తున్న " మా భవనం – నా బాధ్యత " అనే కార్యక్రమంలో సోమవారం 7వ వారం నిర్వహించిన కార్యక్రమంలో నవతరం పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షులు ఎస్.కె.కరీం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.....భారత రాజ్యాంగ నిర్మాత,ప్రపంచ మేధావి,భారతరత్న, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్ పేరు మీద నిర్మించతలపెట్టిన అంబేద్కర్ భవన్ నిర్మాణం గత ఏడు సంవత్సరాలుగా వివిధ కారణాలతో ఆగిపోవడం బాధకరమన్నారు. కర్లపాలెం మండలంలోని దళిత,బడుగు,బలహీన వర్గాల ప్రజల కోసం ఈ అంబేద్కర్ భవన్ చాలా ఉపయోగకరం అని చెప్పారు. ఈ అంబేద్కర్ భవన్ నిర్మాణం పూర్తి అయ్యే వరకు పోరాటం చేస్తామని తెలిపారు. నిర్మాణం పూర్తి కాకుండా ఆగిపోయిన అంబేద్కర్ భవన్ ను పూర్తి చేయాలని స్థానిక ఎమ్మెల్యే,ఎంపీ మరియు జిల్లా కలెక్టర్ ను కోరుతున్నామన్నారు. అంబేద్కర్ భవన్ నిర్మాణం పూర్తి చేసి కర్లపాలెం మండల ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పోరాటం చేస్తున్న దళిత నాయకులు బోరుగడ్డ జీవన్ కు నవతరం పార్టీ అండగా ఉంటుందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు బోరుగడ్డ జీవన్,యు.కిషోర్,కత్తి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలనే లక్ష్యంతో ప్రతి వార్డులోనూ ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాలు

- పురపాలక సంఘం ఇంజనీర్ వెంకటరమణ

**తాడేపల్లిగూడెం ప్రతినిది జూన్ 8 (ప్రజా వీక్షణం)**

తాడేపల్లిగూడెం పురపాలక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని నాన్న కల్యాణ మండపంలో ఆపరేషన్ క్లీన్ స్వీప్ - సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ అవేర్నెస్ 2026 కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ వెంకట రమణ మాట్లాడుతూ ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని సూచించారు. 4 బిన్స్ విధానం - ఆకుపచ్చ, నీలం, ఎరుపు, నలుపు డబ్బాల వినియోగం గురించి తెలియజేశారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ ద్వారా తాడేపల్లిగూడెం పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలనే లక్ష్యంతో ప్రతి వార్డులో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సెక్రటరీలు, మేస్త్రీలు, పారిశుధ్య సిబ్బంది, స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని, చెత్తను వేరు చేసే విధానంపై ప్రతిజ్ఞ చేశారు.




# వర్షా కాలంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోండి

**దేవరకద్ర, జూన్ 8 ప్రజా వీక్షణం**

వర్షాకాలంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసరావు, కోరారు సోమవారంప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గుడి బండ గ్రామాలలో నిర్వహించిన గ్రామ సభలో పాల్గొని ప్రసంగించారు. ఎంపీడీవో శ్రీనివాసరావు పాల్గొని ప్రసంగిస్తూ రానున్న వర్షా కాలంలో నీటి నిల్వలు లేకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని,తడి పోడి చత్త వేరు చేసి ఇవ్వాలని, ఇల్లు నిర్మాణం చేసే వారు తప్పకుండా ఇంకుడు గుంత నిర్మాణం చేయాలని ప్రతి ఇంటిలో మొక్కలు నాటాలని కోరినారు. గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో రానున్న వర్షా కాలంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్ని వార్డులలో ఎలాంటి సమస్యలు ఉన్న సంబంధిత వార్డు ఆఫిసర్లకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. ఈ సభలో గ్రామ సర్పంచ్ పాపన్న, గ్రామ కార్యదర్శులు ప్రజలు పాల్గొన్నారు.

# అన్నదానం మహాదానం

**దేవరకద్ర జూన్8 ప్రజావి క్షణం**

దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలో స్థానిక ఈశ్వర వీరప్పయ్య స్వామి ఆలయంలో సోమవారము భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదానం మహాదానం అని దానిని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఈవో శ్రీనివాసులు కోరారు. ప్రతి వారము ఆలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం వస్తున్నది అని ఆయన తెలిపారు. ఈసారి దేవాలయం తరఫున భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు నాగరాజు, నాగభూషణం, సిబ్బంది వారు భక్తులు తదితరులు పాల్గొన్నారు.





# అయోధ్య బాల రాముడిని దర్శించుకున్న కొండా ప్రశాంత్ రెడ్డి..

**దేవరకద్ర జూన్ 8 ప్రజావి క్షణం**

ఉత్తరప్రదేశ్ లోని అయోధ్య బాల రాముడి దేవాలయాన్ని మరియు వారణాసిలోని కాశి విశ్వనాధ్ దేవాలయాన్ని సోమవారము బిజెపి ఇన్చార్జి కొండ ప్రశాంత్ రెడ్డి,సందర్శించి దర్శనం చేసుకున్నరు. అయోధ్యలోని బలరాముని దర్శించుకోవడం తన అదృష్టమని ఆయన తెలిపారు.



# మలేరియా నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత

## కామవరపుకోట అవగాహన సదస్సులో వైద్య నిపుణులు





**కామవరపుకోట, జూన్ 8: (ప్రజా వీక్షణం)**

మలేరియా రహిత సమాజ స్థాపన ప్రతి ఒక్కరి బాధ్యతతోనే సాధ్యమవు తుందని చింతలపూడి మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎన్. ఎ. ప్రసాద్ పిలుపునిచ్చారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా, ఏలూరు జిల్లా కామవరపుకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో వైద్యాధికారి డాక్టర్ చంద్రలేఖ ఆధ్వర్యంలో సోమవారం ఒక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎన్. ఎ. ప్రసాద్ మాట్లాడుతూ.. దోమల వ్యాప్తిని అరికట్టడానికి ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో, పరిసరాల్లో 'ఫ్రైడే - డ్రై డే' (శుక్రవారం పొడి రోజు) తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో పాటు రాత్రి వేళల్లో దోమతెరలు వాడాలని ఆయన కోరారు. ఎవరికైనా జ్వరం వచ్చినట్లు అనుమానం ఉంటే, వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో రక్త పరీక్షలు చేయించుకోవాలని, వైద్యుల సలహా మేరకు పూర్తిస్థాయిలో మందులు వాడితే జ్వరాలను పూర్తిగా అరికట్టవచ్చని స్పష్టం చేశారు. అవగాహన సదస్సు అనంతరం, ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు పీహెచ్సీ సిబ్బంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి స్థానిక బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ కూడలి వద్ద వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు అందరూ కలిసి మానవహారంగా ఏర్పడ్డారు. మలేరియా నిర్మూలనపై పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ, వ్యాధి నిర్మూలనకు కట్టుబడి ఉంటామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో: అదనపు వైద్యాధికారి విజయసారధి, ఎంహెచ్ఏ కె. శ్రీనివాసరావు,వై. భాస్కర్, ఎం ఎల్హెచ్పీలు, ఏఎన్ఎంలు మరియు ఆశా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గండి చెరువులో అక్రమ మట్టి తవ్వకాలు ఆపాలి

- అధికారులు స్పందించకుంటే ఉపాధి కూలీలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన:
- గ్రామ పెద్ద కొరివి శేషారావు హెచ్చరిక
- గ్రామంలో తీవ్రంగా ఉన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి

**టి.నర్సాపురం జూన్ 08:(ప్రజా వీక్షణం)**

ఏలూరు జిల్లా టీ. నర్సాపురం మండల పరిధిలోని గండిగూడెం గండి చెరువులో సాగుతున్న అక్రమ మట్టి తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని, లేనిపక్షంలో ఉపాధి హామీ కూలీలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని గ్రామ పెద్ద కొరివి శేషారావు హెచ్చరించారు. సోమవారం సాయంత్రం ఉపాధి హామీ కూలీలతో కలిసి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొంతమంది మట్టి మాఫియా నిబంధనలకు విరుద్ధంగా గండి చెరువులో ఇష్టారాజ్యంగా అక్రమ తవ్వకాలు జరుపుతున్నారని మండి పడ్డారు. దీనివల్ల చెరువు తన సహజ భౌగోళిక స్వరూపాన్ని కోల్పోయి, ఖనిజాలు వెలికితీసిన గనిలా భయం కరంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చెరువుపైనే ఆధారపడి జీవిస్తున్న ఉపాధి హామీ కూలీలకు పని దొరకడం లేదని, ఫలితంగా వారు బతుకుదెరువు కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే చెరువు రూపురేఖలు మారడం రజకులకు సైతం ప్రమాదకరంగా పరిణమించిందన్నారు. అలాగే పగటి పూట యంత్రాలు శాంతియుతంగా ఉన్నట్టు నటిస్తూ, రాత్రి కాగానే చీకట్లో యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్నారు. దీనిపై ఇప్పటికే పి.జి.ఆర్.ఎస్ ద్వారా జిల్లా కలెక్టర్, టి.నర్సాపురం ఎంపీడీవో, స్థానిక పంచాయతీ అధి కారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా ఎలాంటి ఫలితం లేదని కొరివి శేషారావు, గ్రామ పెద్దలు తెలిపారు. అంతే కాకుండా కొంతమంది స్వార్థపరుల కోసం చెరువును నాశనం చేస్తుంటే అధికారులు పట్టించుకోక పోవడం దారుణమన్నారు. జిల్లా ఉన్నతాధి కారులు, పంచాయతీ స్పెషల్ ఆఫీసర్, కార్యదర్శి, మరియు పోలీసు అధికారులు వెంటనే స్పందించి మట్టి మాఫియాపై ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యం వహిస్తే ఉపాధి కూలీలను సమీకరించి ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. గండిగూడెం గ్రామంలో ప్రస్తుతం తీవ్ర తాగునీటి సమస్య నెలకొందని కొరివి శేషారావు తెలిపారు. వేసవి తీవ్రత కారణంగా తక్కువ లోతు ఉన్న బోర్లు పూర్తిగా ఎండిపోయాయని, దీంతో ప్రజలు చుక్క నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. పంచాయతీ అధికారులు ఇప్పటికైనా సత్వరమే స్పందించి, గ్రామంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి తాగునీటి సమస్యను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఉపాధి హామీ కూలీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# లక్ష్మీ పల్లిలో ముమ్మరంగా బడిబాట ప్రచారం

- బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి..
- గ్రామ సర్పంచ్ పెద్దమోని లక్ష్మీ ఆంజనేయులు








**దేవరకద్ర జు న్ 8 ప్రజా విక్షణం**

తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని దేవరకద్ర మండల పరిధిలోని సోమవారం లక్ష్మీ పల్లి గ్రామ సర్పంచ్ పెద్ద మోని లక్ష్మీ ఆంజనేయులు పిలుపు నిచ్చారు. ఆచార్య జయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా దేవరకద్ర మండల పరిధిలోని లక్ష్మీ పల్లి లో నిర్వహించిన బడి బాట కార్యక్రమంలో లక్ష్మీ పల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు లయన్ అశ్విని చంద్ర శేఖర్, కోట కద్ర మురళీ ధర్, కావాలి సుజాత లతో కలిసి సర్పంచ్ లక్ష్మీ ఆంజనేయులు ఇంటింటా తిరుగుతూ ప్రచారం చేశారు. అంతేకాకుండా ఉపాధి కూలీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల ప్రధాన్యత ను వివరించారు. బడి ఈడు వయస్సు కలిగిన పిల్లలను మెరుగైన వసతులతో పాటు నాణ్యమైన విద్యను అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. అరకొర వసతులు ఉన్న ప్రైవేట్ పాఠశాలలకు పిల్లలను పంపించి సరైన విద్యను పొందక పోవడమే కాకుండా ఆర్థికంగా నష్ట పో వద్దన్నారు. ప్రభుత్వ పాఠశాల ల్లో చేరిన విద్యార్థులకు ఎలాంటి ఫీజు భారం లేకుండా గుణాత్మకమైన విద్యను అందించడం తో పాటు ఏక రూప దుస్తులు, పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, అల్పాహారం, రాగి జావ, మధ్యాహ్న భోజనం, వారానికి మూడు సార్లు గుడ్లు అందించడం జరుగుతుందని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు లయన్ అశ్విని చంద్ర శేఖర్ మాట్లాడుతూ తల్లి దండ్రులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలని కోరారు. తమ పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు నాంది పలికేది ప్రభుత్వ పాఠశాలలు మాత్రమే అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళీ ధర్, అశ్విని చంద్రశేఖర్, సుజాత, ఎస్ యం సి మాజీ చైర్మన్ జంగా చిన్న కాశన్న, పెద్ద మోని ఆంజనేయులు, వెంకట్రాములు, రాజేందర్ గౌడ్, మాడమోని చెన్నయ్య, కొండయ్య, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన మృగశిర కార్తె ..
# పంట పొలాల వైపు మొగ్గు చూపుతున్న రైతులు..

దేవరకద్ర జూన్ 8 ప్రజా వి క్షణం

సోమవారం నుంచి మృగశిర కార్తె ప్రారంభం అయినది దీని వలన రైతులు పంట పొలాల వైపు పరుగులు తీస్తున్నారు. మృగశిర వచ్చింది అంటే చాలు, వాతావరణం ఒక్కసారిగా మారిపోతుంది. వర్షాకాలం ప్రారంభం అవుతుంది. అయితే అసలు మృగశిర కార్తె ప్రారంభమైన ఎన్ని రోజుల నుంచి వర్షాలు పడతాయి అనే విషయాన్ని ఇప్పుడు మనం వివరంగా తెలుసుకుందాం.రోహిణి కార్తె సమయంలో విపరీతమైన ఎండలు ఉంటాయి. ఈ సంవత్సరం రోహిణి కార్తె మే 25న ప్రారంభమై, జూన్ 8న పూర్తి అవుతుంది, ఆ రోజు నుంచి మృగశిర కార్తె ప్రారంభం కాబోతుంది. మృగశిర కార్తెలో ఆకాశం మొత్తం మేఘాలతో నిండిపోతుంది. ముఖ్యంగా నైరుతి రుతుపవనాలు వచ్చి, తొలకరి చినుకులు కురుస్తాయి. తర్వాత భారీ వర్షాలు పడతాయి.రోహిణి కార్తె సమయంలో విపరీతమైన ఎండలు ఉంటాయి. ఈ సంవత్సరం రోహిణి కార్తె మే 25న ప్రారంభమై, జూన్ 8న పూర్తి అవుతుంది, ఆ రోజు నుంచి మృగశిర కార్తె ప్రారంభం కాబోతుంది. మృగశిర కార్తెలో ఆకాశం మొత్తం మేఘాలతో నిండిపోతుంది. ముఖ్యంగా నైరుతి రుతుపవనాలు వచ్చి, తొలకరి చినుకులు కురుస్తాయి. తర్వాత భారీ వర్షాలు పడతాయి.ఇక మృగశిర కార్తె అంటే, సూర్యుడు రోహిణి నక్షత్రం నుంచి మృగశిర నక్షత్రంలోకి ప్రవేశించడాన్ని మృగశిర కార్తె అంటారు. ఈ సమయంలో తొలకరి చినుకులు పడటంతో రైతులు వ్యవసాయం పనులు మొదలు పెడతారు, దుక్కి దున్ని, విత్తనాలు నాటడం వంటి పనులు చేస్తుంటారు. ఇక మృగశిర కార్తె అంటే, సూర్యుడు రోహిణి నక్షత్రం నుంచి మృగశిర నక్షత్రంలోకి ప్రవేశించడాన్ని మృగశిర కార్తె అంటారు. ఈ సమయంలో తొలకరి చినుకులు పడటంతో రైతులు వ్యవసాయం పనులు మొదలు పెడతారు, దుక్కి దున్ని, విత్తనాలు నాటడం వంటి పనులు చేస్తుంటారు. అందుకే చాలా మంది రైతులు మృగశిర కార్తె కోసం చాలా ఆశగా ఎదురు చూస్తుంగారు. ఇక హిందూ పంచాంగం ప్రకారం, 2026 పరాభవ నామ సంవత్సరంలో సూర్యుడు జూన్ 8న మృగశిర కార్తెలోకి ప్రవేశించి, జూన్ 22 వరకు అక్కడే ఉంటాడు. జూన్ 23 మళ్లీ సూర్యుడు ఆరుద్ర నక్షత్రంలోకి సంచారం చేయడంతో ఆరుద్ర కార్తె ప్రారంభం అవుతుంది. ఇక ఆరుద్ర కార్తెలో వర్షాలు దంచి కొడతాయి అంటారు.అందుకే చాలా మంది రైతులు మృగశిర కార్తె కోసం చాలా ఆశగా ఎదురు చూస్తుంగారు. ఇక హిందూ పంచాంగం ప్రకారం, 2026 పరాభవ నామ సంవత్సరంలో



సూర్యుడు జూన్ 8న మృగశిర కార్తెలోకి ప్రవేశించి, జూన్ 22 వరకు అక్కడే ఉంటాడు. జూన్ 23 మళ్లీ సూర్యుడు ఆరుద్ర నక్షత్రంలోకి సంచారం చేయడంతో ఆరుద్ర కార్తె ప్రారంభం అవుతుంది. ఇక ఆరుద్ర కార్తెలో వర్షాలు దంచికొడతాయి అంటారు.మొదట అంటే జూన్ 8 నుంచి తొలకరి చినుకులతో వర్షాలు ప్రారంభం అవుతాయి. రెండో వారం నుంచి వానలు పడటమే కాకుండా, నైరుతి రుతుపవనాలు ఆకాశాన్ని చుట్టేసి, వాతావరణం చాలా చల్లగా ఉంటుంది. ఆరుద్ర కార్తె నుంచి విపరీతంగా వర్షాలు పడతాయి. దాదాపు పొలం పనులు అన్నీ కూడా ఈ కార్తె వరకు పూర్తి అవుతాయి. ముఖ్యంగా రైతులు మృగశిర సమయంలో పొలం పనులు మొదలు పెట్టి విత్తనాలు నాటుతారు. ఎందు కంటే? ఈ సమయంలో వర్షం పడి విత్తనం పెడితే, పంట బాగా వస్తుందని వారి నమ్మకం.మొదట అంటే జూన్ 8 నుంచి తొలకరి చినుకులతో వర్షాలు ప్రారంభం అవుతాయి. రెండో వారం నుంచి వానలు పడటమే కాకుండా, నైరుతి రుతుపవనాలు ఆకాశాన్ని చుట్టేసి, వాతావరణం చాలా చల్లగా ఉంటుంది. ఆరుద్ర కార్తె నుంచి విప రీతంగా వర్షాలు పడతాయి. దాదాపు పొలం పనులు అన్నీ కూడా ఈ కార్తె వరకు పూర్తి అవుతాయి. ముఖ్యంగా రైతులు మృగశిర సమయంలో పొలం పనులు మొదలు పెట్టి విత్తనాలు నాటుతారు. ఎందుకంటే? ఈ సమయంలో వర్షం పడి విత్తనం పెడితే, పంట బాగా వస్తుందని వారి నమ్మకం.

# ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఘనంగా 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

ఏలూరు, జూన్ 08: (ప్రజా వీక్షణం)



"ప్రజల సమస్యల పరిష్కారమే మా ప్రథమ ప్రాధాన్యత" అని ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, ఐపీఎస్ స్పష్టం చేశారు. సోమవారం ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం అత్యంత పారదర్శకంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో బాధితులు తరలివచ్చి తమ ఫిర్యాదులను అందజేశారు. సాంకేతికతను జోడించి, పూర్తిగా ఆన్‌లైన్ మరియు పేపర్‌లెస్ (కాగిత రహిత) విధానంలో ఈ ఫిర్యాదులను స్వీకరించి, వాటి తక్షణ పరిష్కారానికి ఎస్పీ ప్రత్యేక చర్యలు చేపట్టారు.అలాగే ఈ కార్యక్రమంలో భాగంగా నడవలేని స్థితిలో ఉన్న కొందరు వృద్ధులు, దివ్యాంగ ఫిర్యాదుదారుల వద్దకు ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ స్వయంగా వెళ్లి, వారి సమస్యలను అత్యంత ఓపికగా అడిగి తెలుసుకున్నారు. చట్టపరంగా వారికి త్వరితగతిన న్యాయం చేయాలని సంబంధిత పోలీస్ అధికారులను ఫోన్ ద్వారా అక్కడికక్కడే ఆదేశించారు. ఎస్పీ ఈ చొరవ పట్ల ప్రజల నుండి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.అంతేకాకుండా సమస్యలతో బాధపడుతున్న ప్రజలు ఏలూరు జిల్లా కేంద్రానికే రానవసరం లేదని, తమకు సమీపంలో ఉన్న సబ్-డివిజన్ లేదా సర్కిల్ పోలీస్ కార్యాలయాల్లో కూడా నిస్సంకోచంగా ఫిర్యాదు చేయవచ్చని ఈ సందర్భంగా అధికారులు తెలియజేశారు.



# చార్లెస్ నగర్ వద్ద రోడ్డు వెడల్పు పనులు వెంటనే పూర్తి చేయాలి

- తహసీల్దార్‌కు సామాజిక కార్యకర్తల వినతి
- తీగల వంచ వద్ద గుంతల రోడ్డుకు మరమ్మతులు చేయాలని డిమాండ్

చింతలపూడి, జూన్ 8: (ప్రజా వీక్షణం)

చింతలపూడి – టి.నర్సాపురం ప్రధాన రహదారిలో చార్లెస్ నగర్ వద్ద అసంపూర్తిగా నిలిచిపోయిన రోడ్డు వెడల్పు పనులను వెంటనే పూర్తి చేయాలని కోరుతూ సామాజిక కార్యకర్తలు ఆదివారం స్థానిక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో తహ సీల్దార్ చల్లన్న దొర గారికి వినతిపత్రం అందజేశారు. టి.నర్సాపురానికి చెందిన సామాజిక కార్యకర్తలు ఎస్.డి. నాసర్ పాషా, సయ్యద్ జమీల బేగం తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సామా జిక కార్యకర్త నాసర్ పాషా మాట్లా డుతూ.. చింతలపూడి – టి.నర్సా పురం రోడ్డులో చార్లెస్ నగర్ నుండి గుర్రాజు కుంట వరకు బి.టి రోడ్డు నిర్మాణం చేపట్టినప్పటికీ, చార్లెస్ నగర్ వద్ద రోడ్డు వెడల్పు పనులు మధ్యలోనే నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల ఆ ప్రాంతంలో రోడ్డు ఇరుకుగా మారి వాహనాల రాక పోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని, నిత్యం ట్రాఫిక్ జామ్‌లతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం పొంచి ఉందని పేర్కొన్నారు.రోడ్డు మధ్యలో ఉన్న ఆక్రమణలు, అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలు వాహన దారులకు శాపంగా మారాయని, అలాగే తీగల వంచ వద్ద గత ఏడాది నిర్మించిన రోడ్డు పూర్తిగా గుంతల మయమై ప్రమాదకరంగా తయారైందని ఆయన వివరించారు. అలాగే చార్లెస్ నగర్ వద్ద ఆగిపోయిన రోడ్డు వెడల్పు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి. రోడ్డుకు అడ్డుగా ఉన్న ఆక్రమణలను తొల గించి, విద్యుత్ స్తంభాలను పక్కకు మార్చాలి.తీగల వంచ వద్ద గుంతలు పడిన రోడ్డుకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలి. ప్రమాదాల నివారణకు మూల మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు, ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలి. ప్రజల, వాహనదారుల భద్రత దృష్ట్యా సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి ఈ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని వారు తహసీల్దార్‌ను కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన తహసీల్దార్ చల్లన్న దొర.. సమస్యలను సంబంధిత శాఖ అధి కారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు నాసర్




పాషా తెలిపారు.

# ప్రజా వాణిలో పిర్యాదు లను స్వీకరించిన సీపీ

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 08 (ప్రజా వీక్షణం న్యూస్)

పోలీస్ ప్రజావాణి కార్య క్రమంలో భాగంగా సోమవారం శాంతి భద్రత లకు సంబందించి ప్రజలు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ను కలుసు కొని ఫిర్యాదులను అంద జేశారు. ఫిర్యాదులను పరిశీలించిన పోలీస్ కమిషనర్ సంబదించిన పోలీస్ అధికారులకు ఫోన్ చేసి క్షేత్ర స్థాయిలో పార దర్శకంగా విచారణ జరిపి భాదితులకు న్యాయం చేయాలని పోలీస్ కమిషనర్ అదేశించారు. పోలీస్ సిబ్బంది సైతం శాఖపరమై న సమస్యలపై సీపీ కలుసు కొని వివరించడం తో పాటు వినతి పత్రాన్ని అందజేశారు.




# రామనగర్ గ్రామంలో జీవశక్తి పెంచిన (బయో ఫోర్టిఫైడ్) వరి విత్తనాలు పంపిణీ







సిర్పూర్ కాగజ్ నగర్ ప్రతినిధి: జూన్ 08

(ప్రజావీక్షణం న్యూస్)

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలం రామనగర్ గ్రామ పంచాయతీ పరిధిలో రైతాంగానికి మేలు చేకూర్చే ఉద్దేశంతో హెర్బల్ లైఫ్ వారి సహకారంతో జల్ జీవిక, అధ్వర్యంలో జీవశక్తి పెంచిన (బయో ఫోర్టిఫైడ్) సరికొత్త వరి రకం 'డీఆర్ఆర్ ధన్ 48' విత్తనాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించ బడింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు (ఏ డి ఏ) శ్రీ మనోహర్ , మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) ఉజ్వల్ కుమార్ , స్థానిక సర్పంచ్ ప్రకాష్ సర్కార్ , పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, మరియు జలజీవిక డైరెక్టర్ బొజ్జ పద్మాకర్, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వ్యవ సాయ శాఖ సహాయ సంచాలకులు (ఏ డి ఏ )శ్రీ మనోహర్ మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో వరి రకాల్లో వస్తున్న మార్పులను, వాటి దిగుబడి సామర్థ్యాన్ని రైతులకు వివరించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటిస్తూ నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవడం ద్వారా రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను ఆర్జించవచ్చని ఆయన పేర్కొన్నారు. అనంతరం జలజీవిక డైరెక్టర్ బొజ్జ పద్మాకర్, ప్రత్యేకంగా 'డీఆర్ఆర్ ధన్ 48' వరి రకం విశిష్టతలను రైతులకు వివరించారు. ఈ రకం వరిలో (జింక్) పోషకాలు పుష్కలంగా ఉంటాయని, ఇది పిల్లలు, పెద్దల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. అంతేకాకుండా, తక్కువ గ్లైసిమిక్ ఇండెక్స్ ఏల్ ఓ డబ్ల్యూ జి ఐ కలిగి ఉండటం వల్ల మధుమేహం (షుగర్) ఉన్నవారికి కూడా ఈ బియ్యం ఎంతో ప్రయోజనకరమని, తెగుళ్లను తట్టుకునే శక్తి ఈ రకానికి ఎక్కువగా ఉందని ఆయన వివరించారు. సర్పంచ్ మాట్లాడుతూ ఈ రకం వరి ధాన్యం తో రైతులకు మేలు జరుగుతుంది అని అన్నారు.ఈ విత్తనాల పంపిణీ కార్యక్రమంలో విలేజ్ నెం.12 మరియు విలేజ్ నెం.6 విలేజ్ నెం.13 గ్రామాలకు చెందిన పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని విత్తనాలను స్వీకరించారు. విత్తనాలతో పాటు వాటిని సాగు చేసే విధానాలపై అధికారులు ఇచ్చిన సలహాల పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు.

## ముఖ్యమంత్రి చంద్రబాబుని మర్యాదపూర్వకంగా కలిసిన వలవల మల్లిఖార్జునరావు (బాబ్జి)

తాడేపల్లిగూడెం ప్రతినిది జూన్ 8 (ప్రజా వీక్షణం)

పశ్చిమగోదావరి జిల్లా ఆచంట నియోజకవర్గ పరిధిలోని సిద్ధాంతంలో ఏర్పాటు చేసిన మీ భూమి మీ హక్కు కార్యక్రమంలో భాగంగా రైతులకు పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడుని సోమవారం తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్, భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లిఖార్జునరావు (బాబ్జి) మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గానికి సంబంధించిన వివిధ అంశాలపై ఆయనతో చర్చించారు.



ప్రజావీక్షణం దినపత్రిక
ఎడిటర్: కె. శ్రావణ్ కుమార్

# సంపాదకీయం

## విద్యాసంస్థల్లో మాదక ద్రవ్యాలపై నిఘా !

ఇటీవలి కాలంలో మాదక ద్రవ్యాల పట్టివేత ఆందోళన కలిగిస్తోంది. ఎక్కడికక్క నిత్యం ఎక్కో ఓ చోట మాదక ద్రవ్యాలు పట్టుబడుతూనే ఉన్నాయి. ఉమమడి తెలుగు రాష్ట్రాల్లో గంజాయి విపరీతంగా సరఫరా అవుతోంది. ఈగిల్ టీమ్‌లు పనిచేస్తున్నా, డ్రగ్స్ సరఫరా ఆగడం లేదు. చాపకింద నీరులా డ్రగ్స్ రవాణా సాగుతుతోంది. కాలేజీలు, స్కూళ్లు తెరుస్తున్న వేళ ప్రభుత్వాలు అప్రమత్తం కావాలి. మాదక ద్రవ్యాలు చిన్నారులను చిదిమేయకుండా చూడాలి. తల్లిదండ్రులు కూడా పిల్లల కదలికలను గమనిస్తూ ఉండాలి. ఎవరు ఎవరితో వెళుతున్నారు..ఎక్కడికి అన్నది గుర్తించాలి. మాదక ద్రవ్యాల ముఠాలు విద్యార్థులను లక్ష్యంగా చేసుకని వ్యాపారాలు చేస్తున్నాయి. కఠినంగా వ్యవహరించకపోతే యువత తీవ్ర ప్రమాదంలో పడేలా ఉంది. పిల్లల ప్రవర్తనను, వారు ఎక్కడెక్కడి వెళుతున్నారన్నది తల్లిదండ్రుల నిరతంరం గమనించాలి. వారరు ఎవరి వలలో అయినా పడుతున్నారా అన్నది గుర్తించాలి. విద్యా సంస్థల్లో అవసరమైతే చెకింగ్స్ పెట్టాలి. ఈ రకంగా పిల్లలపై దుష్ప్రభావం చూపకుండా చేయాలి. మాదక ద్రవ్యాల ముఠాలు ఇప్పటికే ఐటి రంగాన్ని, సినిమా రంగాన్ని కేడా ప్రభావితం చేస్తున్నాయి. డ్రగ్స్ పార్టీలు కలకలం రేపుతున్నాయి. ఫామ్‌హౌజ్ పార్టీల్లో డ్రగ్స్ వాడకం పెరిగింది. ఇటీవల పలు కేసుల్లో ఇది నిరూపితం అయ్యింది. ఇతర దేశాలతో పోల్చితే భారతదేశంలో మాదకద్రవ్యాల వినియోగం తక్కువగా ఉంది. అయితే ప్రపంచ వ్యాప్తంగా మాదకద్రవ్యాల అక్రమ రవాణాలో భారత్ క్రమేణా కీలక పాత్ర వహిస్తోంది. సహజంగానే ఇది ఆందోళన కలిగించే అంశం. విశ్వవ్యాప్తంగా ఉత్పత్తి అవుతోన్న హెరాయిన్‌లో 95శాతం థాయిలాండ్, బర్మా, ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్థాన్ లలోనే ఉత్పత్తి అవుతోంది. ఈ దేశాల మధ్య ఉన్న భారత్‌కు మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడం కత్తి మీద సాముగా ఉంది. మాదక ద్రవ్యాల అక్రమరవాణాకు భౌగోళికంగా భారత్ అనువుగా ఉంది. దీంతో అంతర్జాతీయ ముఠాలు భారత్‌పై కన్నేసి ఉంచాయి. భారత్ నుంచి విదేశాలకు నిత్యం రాకపోకలు సాగించే ప్రవాసులను పావులుగా వాడుకోవడానికి ఆ మాఫియా ముఠాలు శతవిధాలుగా ప్రయత్నిస్తున్నాయి. మాదక ద్రవ్యాలన్నింటిలోనూ ఖరీదైన హెరాయిన్‌ను భారతదేశంలో ప్రతి రోజు సగటున 28 లక్షల మంది ఒక టన్ను మేరకు వినియోగిస్తున్నట్టు ఒక సర్వేలో వెల్లడయింది. కేంద్ర ప్రభుత్వమే స్వయంగా ఈ విషయాన్ని తెలిపింది. దీన్ని బట్టి మాదక ద్రవ్యాల వినియోగం ఎంతగా పెరిగిపోయిందో అర్థం చేసుకోవచ్చు. ఒక్క హెరాయిన్ ద్వారా భారత్‌లోకి ప్రతి సంవత్సరం 1.44 లక్షల కోట్ల రూపాయల సొమ్ము మనీలాండరింగ్ ద్వారా వస్తుందని కూడా కేంద్రప్రభుత్వ అధ్వర్యంలోని జాతీయ మాదక ద్రవ్యాల నియంత్రణ సంస్థ అంచనా వేసింది. ఆరంభంలోనే ఈ అక్రమాన్ని నిర్మూలించడానికి సమగ్ర చర్యలు తీసుకోకపోతే తెలుగు రాష్ట్రాల, పంజాబ్‌కు తేడా లేకుండాపోతుంది. మరీ ముఖ్యంగా స్కూళ్లు, కాలేజీలు లక్ష్యంగా ముఠాలు పనిచేస్తున్నట్లు ఇటీవల గుర్తించారు. పిల్లు మాదక ద్రవ్యాలకు బానిసలైతే వారిని దారిలోకి తీసుకుని రావడం కష్టం. అందువల్ల ఈ ముఠాల మూలాలను కనుగొని వాటిని నిర్మూలించాల్సి ఉంది. తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రవాసులతో పాటుగా దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రవాసుల ద్వారా వారికే తెలియకుండా మాదక ద్రవ్యాలను విదేశాలకు సరఫరా చేస్తున్నట్లుగా ఇప్పటి వరకు బహిర్గతమైన కేసుల ద్వారా తెలుస్తోంది. గల్ఫ్ దేశాల్లో మాదక ద్రవ్యాల రవానా, సేవనం పై కఠిన ఆంక్షలు ఉన్నాయి. అక్కడ చాలామంది కఠిన శిక్షలకు గురవుతున్నారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నేరంపై గల్ఫ్ దేశాలలో ముఖ్యంగా కువైత్‌లో ఆంధప్రదేశ్ ప్రవాసులు అధిక సంఖ్యలో జైళ్ళలో మగ్గుతున్నారు. కువైత్ కేంద్ర కారాగారంలో మాదక ద్రవ్యాలకు సంబంధించిన నేరాలపై శిక్ష అనుభవిస్తున్న భారతీయ ఖైదీలలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారే అత్యధికంగా ఉన్నారు. హెరాయిన్ కంటే స్వల్ప ప్రభావం కలిగిన ఔషధ మందులు, గంజాయిని రవాణా చేస్తూ పట్టుబడ్డ వారు యు.ఏ.ఇ., ఖతర్ తదితర దేశాలలోని జైళ్ళలో మగ్గుతున్నారు. దురదృష్టవశాత్తు వీరి నేరాల విషయమై స్వదేశంలోని పోలీసులు లోతుగా విచారణ చేయలేకపోతున్నారు. కొన్ని కేసులలో దర్యాప్తునకు సహకరించడానికి కుటుంబ సభ్యులు ముందుకు రావడం లేదు. మరి కొన్ని కేసులలో స్మగ్లింగ్ ముఠాలు గల్ఫ్ జైళ్ళలో మగ్గుతున్న వారి కుటుంబ సభ్యులకు నెలకు కొంత మొత్తం పారితోషికం ఇస్తున్నారు. దీంతో సంబంధిత ఖైదీల కుటుంబాలు కూడా దర్యాప్తునకు సహకరించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. విదేశాలకు అక్రమ రవాణా అటుంచి స్వదేశంలోనూ మాదక ద్రవ్యాల వినియోగం పెరిగిపోతోంది. హైదరాబాద్‌తో సహా దేశవ్యాప్తంగా పలు నగరాలలో యువతీయువకులు మాదక ద్రవ్యాల వ్యసనానికి గురవుతున్నారు. గల్ఫ్‌లో పుట్టిపెరిగిన కొంత మంది పిల్లలను వారి తల్లిదండ్రులు ఉన్నత విద్యాభ్యాసానికై హైదరాబాద్‌కు పంపించడానికి డ్రగ్స్ కారణంగా భయపడుతున్నారు. ఈ క్రమంలో స్కూళ్లు, కాలేజీల్లో నిఘా పెంచాలి. పిల్లలు ఎవరితో వెళుతున్నారో గుర్తించాలి. కాలేజీలు, స్కూళ్ల పరిసరాల్లో సిసి కెమెరాలను పెంచాలి. దీంతో పిల్లల యోగక్షేమాలకు కూడా అవకాశం ఏర్పడుతుంది. దేశంలో యువతను డ్రగ్స్ మహమ్మారి నుంచి కాపడే యత్నం చేయాలి.

# నేడు రామమ్మ గూడెం లో ఘనంగా కొమరం భీమ్, డా.బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహాల ఆవిష్కరణ సభ

టి. నరసాపురం:జూన్ 9 (ప్రజా వీక్షణం)

ఏలూరు జిల్లా, టీ. నరసాపురం మండలం, ఏపిగుంట పంచాయతీ పరిధిలోని రామమ్మ గూడెం గ్రామం ఒక చారిత్రాత్మక ఘట్టానికి వేదిక కానుంది. ఈ రోజు అనగా మంగళ వారం (09-06-2026) ఉదయం 9:00 గంటలకు ఆదివాసి గిరిజన పోరాట యోధుడు కొమరం భీమ్, రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ ల విగ్రహ ఆవిష్కరణ, సాంస్కృతిక ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మ కంగా నిర్వహించనున్నారు. ఆదివాసి గిరిజన సంఘం ఏలూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో, రాష్ట్ర ఆదివాసి కూటమి సీనియర్ నాయకులు పూసం అంజ నేయులు (అంజిబాబు) నిర్వహణలో ఈ ఉత్సవాలు జరగనున్నాయి. అనాది కాలంగా ప్రకృతిని నమ్ముకుని, 'జల్-జంగిల్-జమీన్' కోసం పోరాడు తున్న ఆదివాసుల ఆచారాలను, కళలను మరియు వారి వీరోచిత చరిత్రను చాటిచెప్పేందుకు ఈ వేదికను సిద్ధం చేశారు. ఈ విగ్రహ ఆవిష్కరణ మహోత్సవానికి రాజకీయ, అధికారిక ప్రముఖులు భారీ సంఖ్యలో తరలిరానున్నారు. ముఖ్య అతిథులుగా: పుట్టామహేష్ కుమార్ (ఏలూరు పార్లమెంట్ సభ్యులు), చిర్రి బాలరాజు (పోలవరం శాసనసభ్యులు), బొరగం శ్రీనివాసులు (ఎ.పి. ట్రైకర్ చైర్మన్), చొక్కా బొజ్జ రెడ్డి (ఎ.పి. ఎస్.టి. కమిషన్ చైర్మన్), కె.ఎస్. జవహర్ (ఎ.పి. ఎస్.సి. కమిషన్ చైర్మన్), కె. రాములు నాయక్ (ప్రాజెక్ట్ ఆఫీసర్, ఐ.టి.డి.ఎ. కన్నాయపురం), కొవ్వాసు జగదీశ్వరి (ఎ.పి. స్టేట్ షాప్ డైరెక్టర్), కాకి వెంకట లక్ష్మి (ఎ.పి. స్టేట్ ఎస్.టి. సెల్ మెంబర్), పొట్టా రామారావు (ఎ.ఎం.సి. చైర్మన్, పోలవరం) వీరితో పాటు మాజీ శాసనసభ్యులు తెల్లం బాలరాజు, మొడియం శ్రీనివాసరావు, వివిధ ఆదివాసి జె.ఎ.సి నాయకులు, స్థానిక తహశీల్దార్, మండల సబ్-ఇన్స్పెక్టర్ జయబాబు తదితరులు పాల్గొననున్నారు. అంతరించిపోతున్న ఆదివాసి సంస్కృతిని, సాంప్రదా యాలను భావి తరాలకు అందించడం మరియు ఆదివాసి తెగల మధ్య ఐక్యత, సోదర భావాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. అలాగే మధ్యాహ్నం 12:00 గంటల నుండి విందు కార్యక్రమం (అన్నదానం) ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమానికి తరలివచ్చి విజయ వంతం చేయాల్సిందిగా ఆదివాసి గిరిజన సంఘం పిలుపునిచ్చింది.





# రైతుల సమస్యలు ఈ ప్రభుత్వాలకు పట్టవా?

- యూరియా కొరత, బ్లాక్ మార్కెట్ దందా, భూమి సారం నాశనం
- రైతాంగాన్ని ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలం..

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జూన్ 08 (ప్రజా వీక్షణం న్యూస్)

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా రాష్ట్రంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగ సమస్యలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ముంజం ఆనంద్ కుమార్ విమర్శించారు. ప్రస్తుతం రైతులకు యూరియా ఎరు వులు సరైన సమయంలో అందు బాటులో లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆన్లైన్ విధానం పేరుతో ఎకరానికి పరిమిత సంఖ్యలో మాత్రమే ఎరువులు ఇస్తుండటంతో రైతులు అవసరమైన ఎరువులను పొందలేకపోతున్నారు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని కొంతమంది ఎరువుల వ్యాపారులు బ్లాక్ మార్కెట్‌కు పాల్పడుతూ రైతులను దోచుకుం టున్నారు. ముఖ్యంగా కౌలు రైతులు, పోరంబోకు భూములు మరియు ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్న రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. వారి పేర్లపై పట్టాదారు పాసుబుక్కులు లేక పోవ డంతో ఆన్లైన్ విధానంలో ఎరువులు పొందడం కష్టంగా మారింది. దీంతో వేలాది మంది రైతులు అధిక ధరలకు బ్లాక్ మార్కెట్‌లో ఎరువులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. యూరియా, ఇతర అవసరమైన ఎరువులు అందుబాటులో లేకపోవ డంతో రైతులు పెద్ద ఎత్తున ఉప్పును పంటలకు వినియోగిస్తున్నారు. దీనివల్ల భూమి సారం పూర్తిగా దెబ్బతిని, రాబోయే కాలంలో వ్యవసాయ భూములు పంటలు పండించలేని స్థితికి చేరుకునే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే స్పందించి వ్యవసాయ భూములకు హానికరంగా మారుతున్న ఉప్పు విని యోగాన్ని నియంత్రించాలని డిమాండ్ చేశారు. ప్రతి మండలంలో మూడు నుంచి ఏడు లారీల వరకు ఉప్పు దిగుమతి అవుతుండటం పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో తెలియజేస్తోం దన్నారు. అలాగే అమ్మోనియా, ఫాస్ఫేట్ ఆధారిత కొన్ని రసాయనాల అధిక వినియోగం వల్ల కూడా భూమి సారం క్షీణిస్తున్నదని పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయ అధి కారుల పర్యవేక్షణ లోపం కారణంగానే బ్లాక్ మార్కెట్ దందాకు అవకాశం ఏర్పడుతోందన్నారు. కొంతమంది పెట్ లైసెన్స్ యజమానులు రైతులను అధిక ధరలతో దోచుకుంటున్నప్పటికీ అధి కారులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. వ్యవసాయ శాఖ రైతులకు ఏ పంటలు సాగు చేయాలి, ఎలా సాగు చేయాలి, ఎలాంటి ఎరువులు వాడాలి, భూమి సారాన్ని ఎలా కాపాడుకోవాలి వంటి అంశాలపై అవగాహన సదస్సులు నిర్వహిం చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రైతులకు సాంకేతిక సలహాలు అందిం చకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మరోవైపు రైతులు కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పిం చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని, రైతాంగాన్ని ఆదుకోవడంలో పూర్తిగా చేతులెత్తే శాయని అన్నారు. అందువల్ల ప్రభుత్వం వెంటనే యూరియా కొరతను నివారించి, కౌలు రైతులు మరియు ప్రభుత్వ భూములు సాగు చేసుకుం టున్న రైతులకు ప్రత్యేకంగా ఎరువుల పంపిణీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, బ్లాక్ మార్కెట్ దందాపై కఠిన చర్యలు తీసుకోవాలని, రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించా లని, వ్యవసాయ శాఖ ద్వారా గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ముంజం ఆనంద్ కుమార్ డిమాండ్ చేశారు.



# ప్రజావాణి దరఖాస్తులకు సత్వర పరిష్కారం చూపాలి

- ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేసి నిరంతరం పర్యవేక్షించాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 08 (ప్రజా వీక్షణం న్యూస్)

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించే ప్రతి దర ఖాస్తును నిర్దిష్ట గడువులోగా పరిష్కరించి, అర్జీదారు లకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్ ఎన్. రవితో కలిసి ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సంద ర్భంగా దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్, వాటిని సంబంధిత శాఖలకు పంపించి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతి వినతి పత్రాన్ని క్షుణ్ణంగా పరిశీలిం చి, సమస్య స్వరూపాన్ని బట్టి సమర్థ వంతమైన పరిష్కారం అందించాలని సూచించారు. ప్రజావాణి నిర్వహణలో సాంకేతిక వ్యవస్థను మరింత సమర్థ వంతంగా వినియోగించాలని పేర్కొన్న కలెక్టర్, ప్రజలు సమర్పించే ప్రతి దరఖాస్తును ముందుగానే స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయా లని ఆపరేటర్లకు సూచించా రు. ఒకే దరఖాస్తు కోసం ప్రజలు పదేపదే కౌంటర్ల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి రాకుండా ప్రక్రియను సరళీ కృతం చేయాలని తెలిపారు. ప్రతి అర్జీ ఆన్‌లైన్ వ్యవస్థలో వెంటనే ప్రతిబింబించేలా చర్యలు తీసుకోవాలని, ఏ దరఖాస్తు కూడా తప్పిపోకుం డా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. అవసర మైతే దరఖాస్తుల నమోదు, డిజిట లైజేషన్ ప్రక్రియ వేగవంతం చేసేందుకు అదనపు సిబ్బందిని నియమించాలని సూచించారు. గత రెండు వారాలుగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని, సంబంధిత శాఖలు వెంటనే విచారణ చేపట్టి పరిష్కార చర్యలు ప్రారంభించాలని ఆదేశించా రు. ప్రతి కేసుపై తీసుకున్న చర్యల వివరాలతో యాక్షన్ టేకెన్ రిపోర్ట్ సమర్పించాలని తెలిపారు. మండల స్థాయి లో పెండింగ్‌లో ఉన్న అర్జీల పరిష్కారానికి తహసీల్దార్లు ప్రత్యేక కార్యాచరణ రూపొం దించి త్వరితగతిన పరిష్క రించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలకు సంబంధించిన మొత్తం 365 దరఖాస్తులు అందాయి. జిల్లా పరిధిలోని హన్మకొండ పరకాల రెవెన్యూ డివిజన్ కార్యాలయాల్లో నిర్వహించి న ప్రజావాణి కార్యక్రమంలో ఆర్డీవోలు, సంబంధిత అధికారులు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ కార్య క్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, జడ్పీ సీఈవో శేషాద్రి, సీపీఓ సత్య నారాయణ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.



ప్రజావీక్షణం దినపత్రిక

GENERAL NEWS

7

09 మంగళవారం, జూన్ 2026

www.prajaveekshanam.in


# జీతాల్లేని జర్నలిస్టుల పిల్లలకు 50% ఫీజు రాయితీ ఇవ్వాలి

## - సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా ( ఐ ఏ ఎస్ ) కు టి డబ్ల్యూ జే ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వడ్నాల వెంకన్న వినతి.

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జూన్ 08 (ప్రజా వీక్షణం న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ లో ఎలాంటి వేతనాలు లేకుండా, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నిలిచి అహర్నిశలు శ్రమిస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ( టి డబ్ల్యూ జె ఎఫ్) కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు వడ్నాల వెంకన్న డిమాండ్ చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా ఐఏఎస్ కు యూనియన్ నాయకులతో కలిసి ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 80 శాతం మంది జర్నలిస్టులు ఎలాంటి నెలవారీ జీతాలు లేక, నిత్యావసరాల ధరలు పెరిగి తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సమాజం కోసం నిరంతరం తపించే జర్నలిస్టులు ప్రజాస్వామ్యంలో నాలుగవ స్తంభం అయినప్పటికీ కార్పొరేట్ విద్యాసంస్థల్లో వేలాది రూపాయల ఫీజులు చెల్లించలేక తమ పిల్లల చదువులను సాగించలేని దుస్థితిలో ఉన్నారన్నారు. జర్నలిస్టుల కుటుంబాల దయనీయ ఆర్థిక పరిస్థితులను మానవీయ కోణంలో పరిశీలించి, ప్రతి ఒక్క జర్నలిస్టు పిల్లలకు రాబోయే 2026-27 విద్యా సంవత్సరం



ప్రారంభమయ్యే నాటికే 50 శాతం ఫీజు రాయితీ వర్తించేలా తక్షణమే ప్రత్యేక సర్క్యులర్ జారీ చేయాలని సబ్ కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు వడ్నాల వెంకన్న తో పాటు ఈర్ల సునీల్ కుమార్, ఎండి నౌషాద్, కడారి శ్రీనివాస్, రాజనర్సయ్య, సిహెచ్ తరుణ్, అన్న బోయిన రాజు, వేల్పుల ప్రదీప్, జి వెంకటేష్, రమేష్ సోనాలె, హైమద్ పాషా జర్నలిస్టులు పాల్గొన్నారు.

# హన్మకొండ డీఎంహెచ్‌వో గా డాక్టర్ ఎస్. దుర్గారాం కుమార్ నియామకం

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 08 (ప్రజా వీక్షణం న్యూస్)**

వైద్య ఆరోగ్యశాఖ బదిలీల్లో భాగంగా హనుమకొండ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారిగా (డీఎంహెచ్‌వో) డాక్టర్ ఎస్. దుర్గారాం కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్‌ను కలిసి బాధ్యతల స్వీకరణపై రిపోర్ట్ చేశారు. ఇంతకుముందు కూకట్‌పల్లి జోన్ డీఎంహెచ్‌వోగావిధులు నిర్వహించిన డాక్టర్ దుర్గా రాంకుమార్ బదిలీపై హనుమకొండ జిల్లాకు రాగా ప్రస్తుతం హనుమకొండ డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్న డాక్టర్ అల్లం అప్పయ్యను ములుగు జనరల్ ఆసుపత్రి ఆర్ఎంఓగా నియమించారు. డిప్యూటీ సివిల్ సర్జన్‌లుగా డాక్టర్ సీహెచ్. మురళి, డాక్టర్ పవిత్రలు హన్మకొండ జిల్లాకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ దుర్గా రాంకుమార్ అదనపు కలెక్టర్ ఎన్. రవి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన అధికారులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో మదన్ మోహన్ రావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రదీప్ రెడ్డి, ప్రోగ్రాం అధికారి డాక్టర్ జ్ఞానేశ్వర్, డాక్టర్ రుబీనా అఫ్రోజ్, ఏవో కోలా రాజేశ్, జిల్లా మాస్ ఎడ్యుకేషన్ మీడియా అధికారి అశోక్ రెడ్డి, హెచ్ఈఈఓ చంద్రశేఖర్, డీపీఓ రుక్మొద్దీన్, ప్రసన్న కుమార్, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలు క్రిమినల్ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి..ఎస్ఐ అప్పారావు..

## - ప్రగడపల్లిలో ప్రజలకు అవగాహన కల్పించడం పోలీస్ అధికారులు..

## - ఆన్లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని.ఎస్ ఐ

**పోలవరం, జూన్ 8 (ప్రజా వీక్షణం )**

పోలవరం మండలం ప్రగడపల్లి గ్రామంలో సోమవారం స్థానిక ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నూతన క్రిమినల్ చట్టాలపై అవగాహన కల్పించడంతో పాటు, అత్యవసర సేవల కోసం 112 హెల్ప్‌లైన్ నంబర్ వినియోగం, సైబర్ నేరాల బారిన పడినప్పుడు ఫిర్యాదు చేయవలసిన 1930 హెల్ప్‌లైన్ నంబర్, పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను గుర్తించి తిరిగి పొందేందుకు ఉపయోగపడే సి ఈ ఐ ఆర్ పోర్టల్, అలాగే మిస్సింగ్ వాహనాల గుర్తింపు మరియు రికవరీ విధానాల గురించి పోలవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ బి కృష్ణ కుమార్ పర్యవేక్షణలో పోలవరం పోలీస్ స్టేషన్ ఎస్ఐ పులపా అప్పారావు అవగాహన కల్పించారు.

యువత నాటు సారా, గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ ఐ

ఎస్ఐ పులపా అప్పారావు ప్రజలకు సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబం మరియు సమాజంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుందని ఎస్ ఐ తెలిపారు. ఈ సందర్భంగా

**ఎస్ ఐ అప్పారావు మాట్లాడుతూ**

రోడ్డు భద్రతలో భాగంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్




ధరించాలని, నాలుగు చక్రాల వాహనాలలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని ప్రజలకు వివరించారు. అదేవిధంగా యువత మత్తు పదార్థాలకు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, ఆన్లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అప్పారావు, మహిళా కానిస్టేబుల్ నాగలక్ష్మి, స్టేషన్ సిబ్బంది స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# బీఆర్ భగవాన్ దాస్ జయంతి వేడుకల్లో పాల్గొని నివాళులు అర్పించిన వరంగల్ ఎంపీ

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 08 (ప్రజా వీక్షణం న్యూస్)**

ప్రముఖ కార్మిక నాయకుడు, సీనియర్ కమ్యూనిస్టు యోధుడు బీఆర్ భగవాన్ దాస్ 96వ జయంతి సందర్భంగా హనుమకొండ అశోక జంక్షన్‌లో సోమవారం నిర్వహించిన వేడుకల్లో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొని వారి విగ్రహాని కి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మీడియాతో మాట్లాడుతూ సీపీఐ పార్టీ నుంచి రాష్ట్రానికి విశిష్టమైన గుర్తింపు తీసుకొచ్చిన మహా నేతల్లో భగవాన్ దాస్ ఒకరని పేర్కొన్నారు. కార్మికులు, గుడిసె వాసులు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఆయన జీవితాంతం పోరాటం చేశారని కొనియాడారు. సాగు నీటి వసతులు, ఉపాధి అవకాశాల కల్పన, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ సాధన కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. భగవాన్ దాస్ ఆశయాలకు అను గుణంగా ప్రజాసేవలో ముందుకు సాగుతున్నామ ని, కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుతో ఈ ప్రాంత యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని తెలిపారు. పేదల స్థిర నివాసాలు, ఉపాధి, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన ఉద్యమాలు నేటి తరానికి స్ఫూర్తిదాయక మని పేర్కొన్నారు. భగవాన్ దాస్ వారసత్వాన్ని కొన సాగిస్తూ ఆయన ఆశయాల ను ముందుకు తీసుకెళ్లేందు కు కట్టుబడి ఉన్నామని ఎంపీ స్పష్టం చేశారు. సీపీఐ, కాంగ్రెస్ పార్టీలు ఎప్పటి నుంచో ప్రజాస్వామ్య, లౌకిక వాద విలువల పరిరక్షణ కోసం కలిసి పని చేస్తున్నాయని తెలిపారు. దేశ రాజ్యాంగాన్ని, సెక్యులర్ స్ఫూర్తిని కాపాడుకోవడంలో ఇరు పార్టీలు సమన్వయం తో ముందుకు సాగు తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, భగవాన్ దాస్ కుమారులు డాక్టర్ బి. రాజ్ సిద్దార్థ, బీఆర్ లెనిన్, బిఆర్ఎస్ నాయకులు మేడిపల్లి శోభన్ బాబు, ఆవోపా జిల్లా అధ్యక్షులు డి. ఈశ్వరయ్య, జర్నలిస్టు సంఘాల



నాయకులు పాల్గొన్నారు. తోట సుధాకర్, కేకే, పి. అశోక్, గోకారపు శ్యామ్, బొడిగె శ్రీను,సిపిఐ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నీట్-2026 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

## - కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 08 (ప్రజా వీక్షణం న్యూస్)**

ఈ నెల 21న జరగనున్న నీట్-2026 పరీక్షలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన పరీక్షా ఏర్పాట్లను సమీక్షించారు. జిల్లా లోని 12 పరీక్షా కేంద్రా ల్లో విద్యుత్, తాగునీరు, పరి శుభ్రత, భద్రత, వైద్యసేవలు, సీసీ కెమెరాలు తదితర సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా ట్రాఫిక్, శాంతిభద్రత ల నిర్వహణపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని పోలీసు శాఖను ఆదేశించారు. పరీక్ష గోప్యత, భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రశ్నా పత్రాల రవాణా, భద్రపరిచే ప్రక్రియలో నిబంధనలను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ సూచించారు.



# జిపిఓ రాజు కు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపిన అధికారులు

**దేవరకద్ర జున్ 8 ప్రజా వీక్షణం**

దేవరకద్ర తహసిల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న జిపిఓ రాజుకు సోమవారం స్థానిక తాహాసిల్దార్ హర్షద్, పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపారు. వారి జీవన దాంపత్యం నిండు నూరేళ్ల పాటు కొనసాగాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో దీపిక, శశికళ,శరత్ నాయక్, పలువురు జి పి ఓ లు పాల్గొన్నారు.



# రాష్ట్రంలో పాఠశాలలను కుదించే కుట్ర

## - సిఎం రేవంత్ తీరుపై మండిపడ్డ కవిత

**హైదరాబాద్,జూన్8 ప్రజా వీక్షణం**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన సమీకృత పాఠశాలలు నిర్ణయంపై టిఆర్ఎస్ చీఫ్ కె.కవిత మండిపడ్డారు. రాష్ట్రంలోని 27,000 పాఠశాలలను 4,000కు కుదించనున్నట్లు సిఎం ప్రకటించడం తీవ్ర అభ్యంతరకరమని సోమవారం విడుదల చేసిన ఒక వీడియో ప్రకటనలో ఆమె పేర్కొన్నారు. పేద విద్యార్థులను, ముఖ్యంగా బాలికలను విద్యకు దూరం చేసేలా ఉన్న ఈ నిర్ణయం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో సుమారు 100 మందికి పైగా విద్యార్థులు మరణించినా సిఎం కనీసం సమీక్ష కూడా నిర్వహించలేదని మండిపడ్డారు. ఇప్పుడు పాఠశాలలు మూసివేస్తున్నామని ప్రకటించారని, విద్యాశాఖపై ప్రభుత్వానికి కనీస పట్టు లేదని ఈ నిర్ణయం స్పష్టం చేస్తోందని అన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గ్రామ సభలో అవగాహన సదస్సు..

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జూన్ 08 (ప్రజా వీక్షణం న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలంలో తెలంగాణ-ప్రభుత్వ పథకాలు-విధానాలపై-99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గ్రామ సభలో అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా వచ్చిన. బెజ్జూర్ మండల ఎంపీడీవో గారు-ఇందిరమ్మ ఇండ్ల పథకం పై సమాజంలో అట్టడుగు-సామాజిక-ఆర్థిక వర్గాలలో అర్హులైన కుటుంబాల గృహ అవసరాల తీర్చడానికి ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన గృహ నిర్మాణ కార్యక్రమమే-ఇందిరమ్మ ఇండ్లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని నిరుపేదలకు అందాలని సూచించారు? రాష్ట్ర ప్రభుత్వం ఆరు గారంటీల అమలులో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిస్పకంగా ప్రారంభించింది.గ్రామాలలోని శాంటేషన్-పారిశుభ్రత నీటి కుళాయిలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ-రోగాల బారిన పడకుండా చూడాలన్నారు-అదేవిధంగా ఎక్కడైతే నీటి గుంటలు ఉంటాయో వాటిని మొరం పోయించి నీరు నిలవకుండా చూసే బాధ్యత గ్రామపంచాయతీ సర్పంచ్ అన్నారు గ్రామంలోని వీధి దీపాల సమస్యను వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం జరిగింది



గ్రామ సభకు ముఖ్యఅతిథిగా వచ్చిన మండల అభివృద్ధి అధికారి ఎంపిడిఓ మరియు సభాధ్యక్షులు స్వయం చిన్న అన్న.వేదికనే అలంకరించిన జిపి కార్యదర్శి మీనాజీ గారు. వ్యవసాయ అధికారి నాగరాజు. ఏఈఓ గారు. రెవిన్యూ ఆఫీసర్ జిపిఓ . విలేజ్ డెవలప్మెంట్ కమిటీ సేడం పకీర్.గౌరవ అధ్యక్షులు రామయ్య.ఉపాధి హామీ కమిటీ కామెర విలాస్ స్థానిక సమస్యల పరిష్కార కమిటీ సిడం జ్యోతి. వివో సరిత. ఎమ్మార్పీఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ విలాస్ గారు. ప్రేమ్ సాగర్. తదితరులు పాల్గొన్నారు.

ప్రజావీక్షణం
దినపత్రిక

## కార్యకర్తల కుటుంబాలను పరామర్శించిన తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ్ బాబ్జి

తాడేపల్లిగూడెం ప్రతినిధి జూన్ 8 (ప్రజా వీక్షణం)

తాడేపల్లిగూడెం మండలంలోని మోదుగగుంట గ్రామానికి చెందిన గ్రామ మాజీ సర్పంచులు ఏపూరి వెంకన్న, గరగ మాణిక్యం ఇటీవల కాలం చేశారు. ఈ విషయం తెలుసుకున్న తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ్, భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లిఖార్జునరావు (బాబ్జి) వారి కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పడంతో పాటు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పరిమి రవికుమార్, ముప్పిడి రమేష్, ఏపూరి సత్యనారాయణ, గరగ బాపిరాజు, కామన ఆంజనేయులు, కర్నాటి పోల్ రెడ్డి, గుల్లపల్లి కొండలరావు, వంద్రు వెంకట్రావు, రామకృష్ణ, ఏపూరి వెంకన్న బాబు, గుల్లపల్లి కొండరాజు, చనుబోయిన నారాయణ స్వామి, కట్టా జానకి రామయ్య, దండుబోయిన వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.





## నిరుద్యోగ యువతకు గొప్ప అవకాశం ఉచిత కుట్టు, మగ్గం వర్క్ శిక్షణ కార్యక్రమాలు

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 08 (ప్రజా వీక్షణం న్యూస్)

నిరుద్యోగ యువతులకు స్వయం ఉపాధి అవకాశాల ను కల్పించే లక్ష్యంతో భారతీయ స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సంస్థ డైరెక్టర్ బాస రవి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమెన్స్ టైలరింగ్ (లేడీస్) 31 రోజుల కోర్సు, మగ్గం వర్క్ అండ్ ఎంబ్రాయిడరీ 31 రోజుల కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. వరంగల్ రూరల్, హనుమకొండ, ప్రొఫెసర్ జయశంకర్ భూపాలపల్లి, జనగాం, ములుగు, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన అభ్యర్థు లు ఈ శిక్షణలకు అర్హులని తెలిపారు.

**అర్హతలు:**

- వయస్సు 18 నుండి 45 సంవత్సరాల మధ్య ఉండాలి.
- తెలుగులో చదవడం, రాయడం వచ్చి ఉండాలి.
- ప్రస్తుతం విద్యాభ్యాసం కొనసాగిస్తున్న విద్యార్థులు అర్హులు కారు.
- తెలుపు రేషన్ కార్డు కలిగి ఉండాలి.

ఆసక్తి గల అభ్యర్థులు నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, విద్యార్హతల జిరాక్స్ ప్రతులతో కలిసి భారతీయ స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ, సంస్కృతి విహార్ టీటీడీసీ, హసన్‌పర్తి, వరంగల్ జిల్లా 506371 చిరునామాలో జూన్ 11, 2026 లోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. శిక్షణ కార్య క్రమాలు జూన్ 12, 2026 నుండి ప్రారంభమవుతాయ ని తెలిపారు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పించడంతో పాటు కోర్సుకు సంబంధించిన మెటీరియల్‌ను కూడా ఉచితంగా అందజేయ నున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ పూర్తిచేసిన వారికి అర్హతా పత్రం (సర్టిఫికెట్) ప్రదానం



చేయబడుతుందని తెలిపారు. మరిన్ని వివరాల కు: 97040 56522, 98493 07873, 62812 60878, 99491 08934 నంబర్లను సంప్రదించాలని అన్నారు.

## డీఎఫ్ఓను కలిసిన పోడు రైతులు, బీఆర్ఎస్ నాయకులు

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జూన్ 08 (ప్రజా వీక్షణం న్యూస్)

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్పోడు భూములను నమ్ముకుని జీవిస్తున్న రైతులకు న్యాయం చేయాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, పోడు రైతులు సోమవారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా అటవీ శాఖ అధికారి (డి ఎఫ్ ఓ)ని కలిసి వినతిపత్రం సమర్పించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం జరిగింది. గత వారం రాష్ట్ర పీసీసీఎఫ్ ను ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో కలిసి పోడు రైతుల సమస్యలను వివరించిన విషయం తెలిసిందే. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని.. జిల్లాలోని కర్జలి, గంగాపూర్, దిందా గూడెం తదితర గ్రామాలకు చెందిన పోడు రైతులు, మహిళలు బీఆర్ఎస్ నాయకులతో కలిసి జిల్లా అటవీ శాఖ అధికారిని కలిశారు. ఈ సందర్భంగా రైతులు తమ గోడును డీఎఫ్ఓకు విన్న వించారు. గత కొంతకాలంగా కుటుంబ జీవనం కోసం ఎకరం, రెండెకరాల భూమిని నమ్ముకుని సాగు చేసుకుంటున్నామని తెలిపారు. ఇప్పుడు ఉన్నఫళంగా భూములు ఖాళీ చేయమంటే తమ కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు అటవీ అధికారుల నుంచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, మానవతా దృక్పథంతో ఆదుకోవాలని కోరారు. రైతుల సమస్య లను సావధానంగా విన్న డీఎఫ్ఓ సానుకూలంగా స్పందించారు. పోడు రైతుల ప్రస్తుత పరిస్థితిని ప్రభుత్వం



దృష్టికి తీసుకెళ్లి, నివేదిక సమర్పిస్తా మని తెలిపారు. అర్హులైన వారందరికీ సమన్యాయం జరిగేలా చూస్తామని, రైతులు ఎవరూ అధైర్యపడవద్దని ఈ సందర్భంగా ఆమె హామీ ఇచ్చారు. పోడు రైతులకు మద్దతుగా డీఎఫ్ఓతో మాట్లాడిన వారిలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు కొంగ సత్యనారాయణ, గోలెం వెంకటేశం, బీఆర్ఎస్ తాలూకా యువజన నాయకులు కాశీపాక రాజు, చింతలమానేపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గోమాసే లాంచ్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పోడు రైతులు, మహిళా రైతులు పాల్గొన్నారు.

## మట్కా స్థావరంపై పోలీసుల దాడి ఐదుగురు అరెస్ట్

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జూన్ 08 (ప్రజా వీక్షణం న్యూస్)

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నికితా పంత్ ఆదేశాల మేరకు. కాగజ్‌నగర్ డీఎస్పీ వహీదుద్దిన్ పర్యవేక్షణలో, టౌన్ సీఐ ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ పరిధిలోని గాంధీ చౌక్ వద్ద మట్కా జూదం నిర్వహిస్తున్న వారిపై పోలీసులు ఆకస్మికంగా దాడులు నిర్వహించి ఐదుగురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.4,910 నగదుతో పాటు 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన వారిలో...

1. లక్ష్మణ్ (60), లారీ డ్రైవర్, నందిగూడ, కాగజ్‌నగర్ రూరల్
2. గులాం జిలానీ (67), కూలీ, శివాపూర్, కాగజ్‌నగర్ రూరల్
3. పిప్రే దేవాజీ (55), లారీ డ్రైవర్, వంజిరి, కాగజ్‌నగర్ రూరల్
4. సయ్యద్ షబీద్దీన్ (51), లారీ డ్రైవర్, కౌసర్ నగర్, కాగజ్‌నగర్
5. సెండే సురేష్ (36), కూలీ, కౌసర్ నగర్, కాగజ్‌నగర్

పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అక్రమ జూదం, మట్కా కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు పోలీసులు తెలిపారు. ప్రజలు ఇటువంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు.



## ప్రజా సమస్యల పరిష్కారం , అభివృద్ధి పనులు వేగవంతం చెయ్యాలని పి జి ఆర్ ఎస్ లో వినతి

- తహసిల్దార్ కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చిన బిజెపి నాయకులు.

పోలవరం జూన్ 8 (ప్రజా వీక్షణం )

పోలవరం మండల పరిధిలోని పలు ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులపై బిజెపి నాయకులు సుదీర్ఘంగా చర్చించి తీర్మానాలను చేసిన అంశాలను సోమ వారం తహసిల్దార్ కార్యాలయంలో నిర్వహించిన పి జి ఆర్ ఎస్ కార్యక్రమంలో అందించిన బిజెపి నాయకులు సమస్యలు పరిష్కరించా లని జిల్లా కలెక్టర్ ను కోరారు. పోలవరం ఏటిగట్టు సెంటర్ నుండి ప్రాజెక్ట్ వరకు ప్రతిపాదించిన రోడ్డు నిర్మాణ పనులను అత్యంత వేగవంతం చేయాలని ,పోలవరం ప్రాజెక్ట్ కాంట్రాక్ట్ ఏజెన్సీల భారీ వాహనాల రాకపోకల వల్ల గతంలో ఉన్న కనెక్టివిటీ రోడ్లు పూర్తిగా ధ్వంస మయ్యాయి. దీనివల్ల రెండు భాగాలుగా ఉన్న పోలవరం గ్రామానికి, ఏటిగట్టు ఇరువైపులా ఉన్న ప్రజలకు రాకపోకలు కష్టతరంగా మారాయని. కాబట్టి ఈ కనెక్టివిటీ రోడ్లను తక్షణమే నిర్మించాలని అవసరమైతే సంబంధిత కంపెనీల సి ఎస్ ఆర్ ఫండ్స్ నుండి నిధులను కేటాయించి అయినా ఈ పనులను పూర్తి చేయాలని కోరారు. రాబోయే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని, మండలంలోని అన్ని ముఖ్యమైన పుణ్యక్షేత్రాలు మరియు తీర ప్రాంతాలలో స్థానిక ప్రజల అభిప్రాయాలు, అవసరాలకు అనుగుణంగా తగిన రీతిలో పుష్కర ఘాట్ల నిర్మాణ పనులను ఇప్పుడే ముందస్తుగా చేపట్టాల్సిందిగా కోరారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని మండలంలోని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ఎరువులు మరియు విత్తనాల కొరత రాకుండా వ్యవసాయ శాఖ ద్వారా ముందస్తుగా తగిన జాగ్రత్తలు మరియు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎల్ ఎన్ డి పేట హైస్కూల్ లో అదనపు తరగతి గదులు, మౌలిక సదుపాయాలను కల్పించాలని



కోరారు. పర్యావరణ సమతుల్యత కోసం "మాకే నామ్ ఏకె పేడ్" (తల్లి పేరుతో ఒక మొక్క) కార్యక్రమంలో భాగంగా మండలంలో విస్తృతంగా మొక్కలు నాటేందుకు, వాటి సంరక్షణకు జిల్లా యంత్రాంగం మరియు అటవీ శాఖ తరపున తగిన సహకారం అందించాలని కోరారు. పై అంశాల గురించి

జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ వహించి సంబంధిత అధికారులను పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా యువ మోర్చా ఉపాధ్యక్షులు సింహాద్రి కళ్యాణ్ పృథ్వి రాజ్ ,జిల్లా జనరల్ సెక్రెటరీ గంటా శ్రీనివాస్ ,జిల్లా కార్యవర్గ సభ్యులు గ్రంది బాలకృష్ణ బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## హోర్ముజ్ జలసంధి మూసివేత

- సంక్షోభంకొనసాగితే ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం- దేశంలో 30 నుంచి 60 రోజులకు సరిపడా ఇంధన నిల్వలు
- కేంద్ర పెట్రోలియం, సహజవాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ

న్యూఢిల్లీ,జూన్8 (ప్రజా వీక్షణం)

హోర్ముజ్ జలసంధి మూసి ఉంచినప్పటికీ దేశంలో ఇంధన నిల్వలకు ఢోకా లేదని కేంద్ర పెట్రోలియం, సహజవాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ తెలిపారు. 30 నుంచి 60 రోజుల వరకూ సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని కేంద్రమంత్రి తెలిపారు. అయితే పశ్చిమాసియాలో యుద్ధ సంక్షోభం సుదీర్ఘకాలం కొనసాగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించారు. సోమవారంనాడిక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ... 'మరో 30 రోజులు హోర్ముజ్ జలసంధి మూతపడే ఉంటే ఏం జరుగుతుంది? దేశీయంగా మనకు తగినన్ని నిల్వలు ఉన్నాయి. 60-60-60 అని చెప్పగలను. అంటే 60 రోజులకు సరిపడా క్రూడాయిల్, నేచరల్ గ్యాస్, ఎల్‌పీజీ నిల్వలు ఉన్నాయి' అని హర్దీప్ సింగ్ పురీ చెప్పారు. స్వల్పకాలిక అంతరాయాలను భాగస్వామ్య దేశాల సపోర్ట్‌తో అధిగమించేందుకు అవసరమైన వ్యూహాత్మక ప్రణాళికలు తమ వద్ద ఉన్నాయని అన్నారు. పశ్చిమాసియాలో పరిస్థితి రెండు మూడు రకాలుగా ఉండొచ్చని, ఘర్షణలు విస్తరిస్తే అది అసాధారణ పరిస్థితి అవుతుందని, అది బాధాకరమని అన్నారు. ఒకవేళ హోర్ముజ్ జలసంధిని మూసి ఉంచిన పక్షంలో ప్రత్యామ్నాయ మార్గాల కోసం ఇప్పటికే చర్యలు ప్రారంభించామని చెప్పారు.

## టీఎంసీ కి మరో ఎదురుదెబ్బ

- రాజ్యసభ ఎంపి సుఖేందు శేఖర్ రాయ్ రాజీనామా

కోల్‌కతా,జూన్8 (ప్రజా వీక్షణం)

టీఎంసీ కి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ ఎంపీ సుఖేందు శేఖర్ రాయ్ తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. టీఎంసీతో తన బంధాన్ని తెంచుకుంటున్నట్లు వెల్లడించారు. పార్టీ అసెంబ్లీ సభ్యుల్లో తిరుగుబాటు పార్లమెంట్ వైపు కూడా పాకొచ్చని ఇటీవలే ఆయన పార్టీ తీరుపై అసంతృప్తి వ్యక్తంచేశారు. టీఎంసీలో అంతర్గత విభేదాలు పెరుగుతున్న వేళ ఆయన పార్టీ నుంచి వైదొలగడం ప్రాధాన్యం సంతరించుకుంది. టీఎంసీలో అత్యంత వాక్చాతుర్యం గల సీనియర్ నాయకులలో ఒకరిగా సుఖేందు పేరు సంపాదించారు. పార్టీని వీడుతున్నట్లు సుఖేందు తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీకి లేఖ రాశారు. అందులో పార్టీలో విచ్చలవిడిగా పెరిగిపోయిన అవినీతిని, మహిళలపై తీవ్ర అణచివేతను, విద్య, ఆరోగ్య సంరక్షణ, పరిశ్రమ, ఉపాధి, శాంతిభద్రతలతో సహా పలు రంగాలలో నెలకొన్న తీవ్ర అరాచకాన్ని ప్రజలు తిరస్కరించారని పేర్కొన్నారు. మరోవైపు భాజపాపై ప్రశంసలు కురిపించారు. బెంగాల్ చరిత్రలో తొలిసారిగా ఓటర్లు ఆ పార్టీకి భారీ విజయాన్ని అందించారన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన హామీల అమలు దిశగా కొత్తగా ఎన్నికైన ప్రభుత్వం ఇప్పటికే చర్యలు ప్రారంభించిందని ప్రశంసించారు. ఇప్పటికే దాదాపు 61 మంది ఎమ్మెల్యేలు పార్టీ రెబల్ నేత రితబ్రతకు మద్దతివ్వడంతో శాసనసభలో ప్రతిపక్ష నాయకుడిగా స్పీకర్ ఆయనను నియమించారు.

# ఎల్ ఎన్ డి పేట పాఠశాలలో అదనపు తరగతి గదులు, మౌలిక సదుపాయాలు కల్పించాలి

- ఎంఈఓ కు వినతిపత్రం ఇచ్చిన బిజెపి నాయకులు..

పోలవరం జూన్ 8 (ప్రజా వీక్షణం )

పోలవరం మండలం ఎల్ ఎన్ డి పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదులు మరియు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ బిజెపి జిల్లా యువ మోర్చా ఉపాధ్యక్షులు సింహాద్రి కళ్యాణ్ పృథ్వీ రాజ్ తో కలిసి పోలవరం మండల బిజెపి కార్యవర్గ సభ్యులు సోమవారం పోలవరం మండల విద్యాధికారి ఎల్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సింహాద్రి కళ్యాణ్ మాట్లాడుతూ ఎల్ ఎన్ డి పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గతంలో 1వ తరగతి నుండి 7వ తరగతి వరకు మాత్రమే చదువు చెప్పేవారిని గత విద్యా సంవత్సరం (2025-2026) నుండి హైస్కూల్గా అప్గ్రేడ్ చేయడం జరిగిందని అన్నారు. హైస్కూల్గా మారిన తర్వాత 9వ తరగతి వరకు విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేకపోవడంతో గ్రామస్థులు స్వచ్ఛందంగా సహకారం అందించి తాత్కాలికంగా ఒక రేకుల షెడ్డును నిర్మించడం జరిగిందన్నారు. ప్రస్తుత రేకుల షెడ్డు కేవలం 8వ తరగతి వరకే సరిపోతుందని ఈ విద్యా సంవత్సరం (2026) నుండి కొత్తగా 9వ తరగతి క్లాసులు నిర్వహించాల్సి ఉందన్నారు. కానీ విద్యార్థులు కూర్చోవడానికి కనీసం ఒక్క గది కూడా అందు బాటులో లేకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాలు బాగుండటం వల్ల ప్రస్తుత విద్యార్థుల సంఖ్య 223 కి చేరిందని రాబోయే రోజుల్లో ఈ సంఖ్య మరో 30 శాతం పెరిగే అవకాశం దాంతో సుమారు 300 మంది విద్యార్థులు పాఠశాలలో చదువుకునే అవకాశం ఉందన్నారు. ఈ క్లిష్ట పరిస్థితిలో 9వ తరగతి విద్యార్థుల భవిష్యత్తును



దృష్టిలో ఉంచుకుని, వారికి విద్యా సంవత్సరం నష్టపోకుండా ఉండాలంటే తక్షణమే తరగతి గదులు అవసరమని కావున ఎల్ ఎన్ డి పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి యుద్ధప్రాతిపదికన అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని మంజూరు చేయాలని అలాగే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా త్రాగునీరు, మరుగు దొడ్లు వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలని గ్రామ ప్రజల తరపున కోరుతూ బిజెపి నాయకులు మండల విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు ..ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా యువ మోర్చా ఉపాధ్యక్షులు సింహాద్రి కళ్యాణ్ పృథ్వీ రాజ్ ,జిల్లా జనరల్ సెక్రెటరీ గంటా శ్రీనివాస్ ,జిల్లా కార్యవర్గ సభ్యులు గ్రంది బాలకృష్ణ బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# గ్రామ సమస్యలపై కలెక్టర్ ను కలిసిన సర్పంచ్ వేణుగోపాల్

సిర్పూర్ కాగజ్ నగర్ ప్రతినిధి: జూన్ 08 (ప్రజావీ క్షణం న్యూస్ )

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలం బారెగూడ గ్రామపంచాయతీ లోని సర్పంచ్ కోట వేణుగోపాల్, జిల్లా కలెక్టర్ హ రిత ను కలిసి గ్రామాన్ని సంబంధించిన పలు కీలక సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్, సరఫరా సమస్యలు ఇందిరమ్మ ఇల్లు, మంజూరు కాగజ్ నగర్ పట్టణం నుండి బారెగూడ గ్రామ పంచాయతీ వరకు నూతన (బీటీ) రహదారి నిర్మాణం అలాగే గ్రామ అభివృద్ధికి సంబంధించిన ఇతర మౌలిక వసంతుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వినతి పత్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ సమస్యల పరిష్కారానికి సానుకులంగా స్పందిస్తూ సంబంధిత శాఖల అధికారులను అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వ తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. గ్రామ అభివృద్ధి మరియు ప్రజాసమక్షల పరిష్కారమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తామని సర్పంచ్ కోట వేణుగోపాల్, తెలియజేశారు.



# నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేపమందు పంపిణీ

- ఏర్పాట్లను పరిశీలించిన సిపి సజ్జన్నార్
- పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు
- పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ డైవర్షన్

హైదరాబాద్,జూన్8 (ప్రజా వీక్షణం)

చేప మందు పంపిణీ సందర్భంగా నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో భద్రతా ఏర్పాట్లను హైదరాబాద్ సీపీ సజ్జనార్ పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్యూలైన్లు, కౌంటర్లు, మినీ కమాండ్ కంట్రోల్ సెంటర్ పని తీరును పరిశీలించారు. సీపీతో పాటు జాయింట్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్, ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్, గోల్కొండ డీసీపీ చంద్ర మోహన్ ఏర్పాట్లను పరిశీలించారు. ఇప్పటికే నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు చేప మందు భక్తులు వేలాదిగా తరలివస్తున్నారు. దీంతో నాంపల్లి మెట్రో పరిసర ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వాహనాలు నెమ్మదిగా కదులుతున్న పరిస్థితి. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో భక్తుల కోసం చేప ప్రసాదం పంపిణీ సందర్భంగా వైద్య, అగ్నిమాపక శాఖలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. చేప ప్రసాదం కోసం వచ్చిన వారి కోసం 3 హెల్త్ క్యాంప్‌లను అందుబాటులో ఉంచారు. అత్యవసర పరిస్థితుల కోసం 5 అంబులెన్సులను సిద్ధం చేశారు. అస్వస్థతకు గురైన వారికి అక్కడికక్కడే ప్రాథమిక చికిత్స అందించనున్నారు. అవసరమైతే ఉస్మానియా ఆస్పత్రికి తరలింపుకు ఏర్పాట్లు చేశారు. వైద్య సిబ్బందితో హెల్త్ టీమ్ 24 గంటలూ అప్రమత్తంగా ఉండనుంది. భద్రతా చర్యల్లో భాగంగా 3 ఫ౯ర్ ఇంజిన్లు అందుబాటులో ఉన్నాయి. భారీ జనసందోహం నేపథ్యంలో ప్రత్యేక అత్యవసర సేవలను ఏర్పాటు చేశారు. చేప ప్రసాదం కోసం వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సదుపాయాలను అధికారులు కల్పించారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేపమందు పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రభుత్వం తరఫున లక్షకు పైగా చేప పిల్లల ఏర్పాటు చేశారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. ఇప్పటికే దాదాపు 50 వేల మంది నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు చేరుకున్నారు. సాయంత్రం 7 గంటల నుంచే క్యూలైన్లలో ఉండనున్నారు. రాత్రి 9 గంటల 1 నిమిషానికి చేపమందు పంపిణీ ప్రారంభంకానుంది. శుభ ముహూర్తం ప్రకారమే చేపమందు పంపిణీని నిర్వాహకులు ప్రారంభించనున్నారు. ఉబ్బసం, ఆస్తమా బాధితులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. భద్రత, వైద్య సదుపాయాలు, తాగునీటి ఏర్పాట్లతో అధికారులు సిద్ధమయ్యారు. చేపమందు పంపిణీ నేపథ్యంలో నాంపల్లి పరిసరాల్లో ప్రత్యేకంగా ట్రాఫిక్ నిబంధనలు విధించారు. చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు చేసినట్లు సీపీ సజ్జనార్ తెలిపారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈ రోజు రాత్రి 9 గంటల నుంచి చేప ప్రసాదం పంపిణీ ప్రారంభం కానుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి సంబంధించి మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, అజారుద్దీన్ ఏర్పాట్లను పరిశీలించినట్లు తెలిపారు. ఇప్పటికే దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 25 వేల మంది హైదరాబాద్‌కు చేరుకున్నారని వెల్లడించారు. చేప ప్రసాదం పంపిణీ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వెయ్యి మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేసినట్లు



సీపీ తెలిపారు. భద్రతా చర్యలను గోల్కొండ డీసీపీ చంద్ర మోహన్ పర్యవేక్షిస్తారని చెప్పారు. అలాగే ట్రాఫిక్ సమస్యలు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, నాంపల్లి పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేస్తున్నామని వెల్లడించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఐదు అంబులెన్సులను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి వివిధ భాషల్లో సూచనలు, సమాచారాన్ని అందిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో నివసించే వారు రద్దీని దృష్టిలో ఉంచుకుని వీలైతే మంగళవారం వచ్చి చేప ప్రసాదం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అందరికీ సరిపడా చేప ప్రసాదం అందుబాటులో ఉందని, ఎలాంటి పుకార్లను నమ్మవద్దని సూచించారు. ఎన్జీవో సంస్థల వద్ద కూడా పోలీసు భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు. షీ టీమ్స్, మఫ్టీ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తారని పేర్కొన్నారు. గతంలో జరిగిన కొన్ని ఆరోగ్య అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈసారి మరింత కట్టుదిట్టమైన భద్రత, వైద్య సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. రాత్రి వేళల్లో కార్యక్రమం జరుగనున్న నేపథ్యంలో భక్తులు పోలీసుల సూచనలు పాటించి సహకరించాలని సీపీ సజ్జనార్ కోరారు.

# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు
## 24 క్యారెట్ల ధర .1,51,690కు చేరిక

న్యూఢిల్లీ,జూన్8 (ప్రజా వీక్షణం)

గత వారమంతా తగ్గిన బంగారం ధరలు అదే ట్రెండ్‌ను కొనసాగిస్తున్నాయి. ఈ వారం మొదటి రోజునే మళ్లీ ధరల్లో కోత పడింది. భారత్‌లో మేలిమి బంగారం ధర సగటున రూ.1000 మేర తగ్గింది. వెండి మాత్రం స్థిరంగా కొనసాగుతోంది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, సోమవారం ఉదయం 10.30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,51,690కు పడిపోయింది. క్రితం ముగింపుతో పోలిస్తే ధరలో రూ.1,040ల మేర కోత పడింది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి కూడా రూ.950ల మేర తగ్గి రూ.1,39,050కు చేరుకుంది. నగరంలో వెండి ధర మాత్రం స్థిరంగా కొనసాగుతోంది. కిలో వెండి రూ.2.7 లక్షలుగా ఉంది. విజయవాడలో కూడా దాదాపుగా ఇవే ధరలు కొనసాగుతున్నాయి. దేశంలోని ఇతర నగరాల విషయానికి వస్తే చెన్నైలో ప్రస్తుతం 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,53,490గా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,40,700గా ఉంది. ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి రూ.1,51,690ల వద్ద కొనసాగుతుండగా 22 క్యారెట్ల పసిడి రూ.1,39,050ల వద్ద ట్రేడవుతోంది. దేశరాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం (10 గ్రాములు) ధర రూ.1,51,840గా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,39,200గా ఉంది. వివిధ నగరాల్లో కిలో వెండి ధర రూ.2.6 లక్షల నుంచి రూ.2.7 లక్షల మధ్య కొనసాగుతోంది.

# తృణమూల్ నేత జంగీర్ ఖాన్ అరెస్ట్

- దేశ సరిహద్దులు దాటుతుండగా పట్టివేత
- ఖాన్‌పై పలు కేసులు నమోదు

కోల్‌కతా,జూన్8 (ప్రజా వీక్షణం)

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కలవరం సృష్టించిన తృణమూల్ కాంగ్రెస్ కీలక నేత జహంగీర్ ఖాన్ ఎట్టకేలకు పోలీసులకు చిక్కారు. గత కొన్ని రోజులుగా పోలీసుల కళ్లుగప్పి తప్పించుకు తిరుగుతున్న ఆయన్ను పశ్చిమ బెంగాల్ పోలీస్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ సోమవారం తెల్లవారు జామున వ్యూహాత్మకంగా అదుపులోకి తీసుకుంది. దేశం దాటి పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా నేపాల్ సరిహద్దు ప్రాంతంలో నిఘా వర్గాల పక్కా సమాచారంతో ఎస్టీఎఫ్ అధికారులు ఆయన ఆట కట్టించారు. జహంగీర్ ఖాన్‌పై బెంగాల్‌లోని సౌత్ 24 పరగణాల జిల్లా ఫాల్తా పోలీస్ స్టేషన్‌లో వివిధ సెక్షన్ల కింద 7 క్రిమినల్ కేసులకు సంబంధించి ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. వీటిలో ప్రధానంగా ఓటర్లను భయభ్రాంతు లకు గురిచేయడం, భూఅక్రమణలు, మహిళలను వేధించడం వంటి తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి. తనపై నమోదైన వరుస కేసుల్లో పోలీసులు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకుండా స్టే ఇవ్వాలని జహంగీర్ ఖాన్ గతంలో కలకత్తా హైకోర్టును ఆశ్రయించారు. మే 18న కోర్టు ఆయనకు తాత్కాలిక ఉపశమనం కల్పించి నప్పటికీ, తాజాగా ఆ రక్షణను న్యాయస్థానం ఉపసంహరించుకుంది. కేవలం రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు మారాయనో, లేదా దీని వెనుక రాజకీయ కక్షసాధింపు ఉందనే పిటిషనర్ వాదనల ఆధారంగా క్రిమినల్ కేసుల్లో రక్షణను పొడిగించలేమని న్యాయమూర్తులు స్పష్టం చేశారు. మే 4న అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాతే తన క్లయింట్‌పై కావాలనే వరుస కేసులు పెట్టారని, ఇదంతా రాజకీయ పగతో జరుగుతున్న వేధింపులని జహంగీర్ ఖాన్ తరపు సీనియర్ న్యాయవాది కిషోర్ దత్తా కోర్టులో వాదించారు. అడిషనల్ అడ్వకేట్ జనరల్ రాజ్‌దీప్ మజుందార్ ఈ వాదనను గట్టిగా వ్యతిరేకించారు. మే 21న ఫాల్తా నియోజకవర్గంలో జరిగిన రీ-పోలింగ్‌లో ఖాన్ పాల్గొనేందుకు మాత్రమే గతంలో కోర్టు రక్షణ ఇచ్చిందని, మే 24న ఫలితాలు కూడా వచ్చేసినందున ఇక ఆ ప్రొటెక్షన్‌ను పొడిగించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కాగా, ఫాల్తా అసెంబ్లీ నియోజకవర్గ రీ-పోలింగ్ సమయంలో బెంగాల్ రాజకీయాల్లో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. టీఎంసీ అధినేత్రి, మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి గట్టి షాక్ ఇస్తూ జహంగీర్ ఖాన్ ఎన్నికల బరి నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించి తన నామినేషన్‌ను ఉపసంహరించు కున్నారు. ఫాల్తా ప్రాంత ప్రజల సంక్షేమం కోసమే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు అప్పట్లో ఆయన ప్రకటించారు. 'నేను ఫాల్తా బిడ్డను. ఇక్కడ ప్రశాంతత, అభివృద్ధిని ఆకాంక్షిస్తున్నాను. మన ముఖ్యమంత్రి సువేందు అధికారి ఫాల్తా అభివృద్ధి కోసం ప్రత్యేక ప్యాకేజీని ప్రకటిస్తున్నారు. అందుకే నేను ఈ రీ-పోలింగ్ రేస్ నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నాను' అని జహంగీర్ ఖాన్ పేర్కొనడం గమనార్హం. జహంగీర్ ఖాన్ నామినేషన్ ఉపసంహరణపై తృణమూల్ కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. బీజేపీ ప్రభుత్వం తమ నేతలపై తీవ్రమైన ఒత్తిడి తీసుకువచ్చిందని, టీఎంసీ పార్టీ కార్యాలయాలపై దాడులకు తెగబడి భయభ్రాంతులకు గురిచేయడం వల్లే ఖాన్ ఎన్నికల నుంచి తప్పుకోవాల్సి వచ్చిందని ఆరోపించింది. ఏదేమైనా, కోర్టు రక్షణ కోల్పోయిన కొద్దిరోజులకే ఈ కీలక నేత నేపాల్ బోర్డర్‌లో ఎస్టీఎఫ్ చేతికి చిక్కడం ఇప్పుడు బెంగాల్ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తృణమూల్ కాంగ్రెస్ నేత, ఫాల్తా అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థి జహంగీర్ ఖాన్ను పశ్చిమబెంగాల్ పోలీసుల ప్రత్యేక టాస్క్ ఫోర్స్ సోమవారం అరెస్ట్ చేసింది. జహంగీర్ ఖాన్ పశ్చిమ బెంగాల్ సరిహద్దు ప్రాంతం నుండి దేశం విడిచిపారిపోయేందుకు యత్నించాడని పోలీసులు పేర్కొన్నారు. ఏప్రిల్ 29న ఫాల్తాలో రెండవ దశ పోలింగ్ సమయంలో జహంగీర్ ఖాన్ పై అవతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో ఎన్నికల సంఘం ఆ ఎన్నికను రద్దు చేసి, మే 21న తిరిగి పోలింగ్ నిర్వహించనున్నట్లు ప్రకటించింది. అయితే జహంగీర్ ఖాన్ పోటీ నుండి వైదొలిగి, పరారీలో ఉన్నాడు. ఫాల్తాలో జరిగిన రీపోలింగ్ లో బిజెపి అభ్యర్థి లక్షకు పైగా ఓట్ల మెజారిటీతో గెలుచుకున్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం జహంగీర్ ఖాన్ పై గ్రామస్థులు భూకబ్జా, దోపిడీ ఆరోపణలు చేశారు. పశ్చిమబెంగాల్ లో బిజెపి అధికారం చేపట్టిన తర్వాత అరెస్ట్ అయిన టిఎంసి నేతల జాబితాలో జహంగీర్ ఖాన్ కూడా చేరారు. మాజీ ఎమ్మెల్యేలతో సహా పలువరు టిఎంసి నేతలను పోలీసులు అదుపులోకీ తీసుకున్నారు. 2026 మార్చిలో బాంబు పేలుడులో పాత్ర ఉందనే ఆరోపణలపై, గతవారం జాతీయ దర్యాప్తు సంస్థ మాజీ ఎమ్మెల్యే సౌకత్ మూలాను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.

# యూరియా యాప్‌తో రైతులకు మేలు

అన్ని రాష్ట్రాల్లో అమలుకు ఆసక్తి

ప్రశంసలు అందించిన కేంద్ర వ్యవసాయ శాఖ

మంత్రి తుమ్మల కార్యాలయం ప్రకటన

హైదరాబాద్,జూన్8 (ప్రజా వీక్షణం)

రైతులకు పారదర్శకంగా ఎరువుల పంపిణీ చేయడం ద్వారా తెలంగాణ ఫర్టిలైజర్ యాప్‌నకు దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుతున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. రాష్ట్ర ఫర్టిలైజర్ యాప్‌ను పొరుగు రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని తెలిపారు. తెలంగాణ నమూనాపై ప్రత్యేక యాప్‌ల రూపకల్పనకు ఇతర రాష్ట్రాలు చర్యలు చేపట్టాయని ఆయన వివరించారు. తెలంగాణ ఫర్టిలైజర్ యాప్.. కేంద్ర వ్యవసాయ శాఖ ప్రశంసలు కూడా పొందిందని మంత్రి తుమ్మల గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా ఈ÷ూం÷ూ ఎరువుల యాప్ అమలుకు కేంద్రం సన్నాహాలు చేస్తోందని వివరించారు. రెండు జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా ఈ÷ూం÷ూ యాప్ అమలు చేస్తామన్నారు. యాప్‌లో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. దీంతో ఎరువులను మీ సేవా కేంద్రాల ద్వారా బుకింగ్ చేసుకునే అవకాశం ఉందన్నారు. టెలిఫోన్ ద్వారా కూడా ఎరువుల బుకింగ్ సదుపాయం అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు. ల÷తుల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశామని మంత్రి తుమ్మల తెలిపారు. డీలర్ల వద్ద స్టాక్ వివరాలు మొబైల్‌లోనే తెలుసుకునే విధంగా సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు. దీంతో ఎరువుల కోసం క్యూ లైన్‌లకు చెక్ పెడుతూ.. రైతులకు సమయానుకూల సేవలు అందిస్తున్నామని స్పష్టం చేశారు. ఎరువుల పంపిణీలో అక్రమాలకు ఈ ఫర్టిలైజర్ యాప్ అడ్డుకట్ట వేసిందన్నారు. ఖరీఫ్ అవసరాల కోసం 6 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించాలని కేంద్రాన్ని తెలంగాణ ప్రభుత్వం కోరిందని చెప్పారు. మిగిలిన యూరియా సరఫరా కోసం కేంద్రంతో నిరంతరాయంగా సమన్వయం చేసుకుంటున్నామన్నారు. అందుకోసం ఢిల్లీలో ప్రత్యేక నోడల్ అధికారిని ప్రభుత్వం నియమించిందని పేర్కొన్నారు. నౌకాశ్రయాల్లోని పోర్టుల నుంచి యూరియా వేగంగా తరలింపునకు ప్రత్యేక అధికారిని కూడా ఏర్పాటు చేశామన్నారు. రైతుల ప్రయోజనాల కోసం ప్రతి దశను ప్రభుత్వం పర్యవేక్షిస్తుందని మంత్రి తుమ్మల వివరించారు. రైతు సంక్షేమ కార్యక్రమాలపై రాజకీయాలు చేయవద్దంటూ ప్రతిపక్షాలకు ఈ సందర్భంగా మంత్రి తుమ్మల హితవు పలికారు. రైతులకు మెరుగైన సేవల కోసం సాంకేతిక వినియోగాన్ని విస్తరిస్తామన్నారు. ఈ మేరకు ఆదివారం తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కార్యాలయం ప్రెస్ నోట్ విడుదల చేసింది.

# ఆశాజనకంగా నైరుతి విస్తరణ

- పలు ప్రాంతాల్లో తగ్గిన పగటి ఉష్ణోగ్రతలు

హైదరాబాద్,జూన్8 (ప్రజా వీక్షణం)

నైరుతి రుతుపవనాలు ఆశాజనకంగా ముందుకు విస్తరిస్తున్నాయి. దీనిప్రభావంతో చాలా ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు పడిపోయాయి. రెండు, మూడు రోజుల్లో తెలంగాణ లోకి రుతుపవనాలు ప్రవేశిస్తాయని అధికారులు తెలిపారు. వచ్చే నాలుగు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఓ మోస్తరు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. వికారాబాద్, సంగారెడ్డి, నారాయణపేట, మహబూబ్‌నగర్, గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నట్లు అధికారులు తెలిపారు. హైదరాబాద్ నగరంలో సాయంత్రం నుంచి రాత్రి వరకు పశ్చిమ-దక్షిణ ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొన్నది. ఈనెల 10వతేదీ వరకు హైదరాబాద్ నగరానికి ఎల్లో అలర్ట్ జారీచేసింది. నాలుగు రోజులు నగరంలో భారీ వర్షాలతోపాటు ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. గంటకు 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని పేర్కొన్నది. గడిచిన 24 గంటల్లో రాష్ట్రంలోని వనపర్తి, వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, హైదరాబాద్, యాదాద్రి -భువనగిరి జిల్లాల్లో మోస్తరు వర్షా లు కురిసినట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. వనపర్తి జిల్లా ఏదుల మండలంలో అత్యధికంగా 5.08 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. వికారాబాద్ జిల్లా తాండూరులో 4.73 సెంటీమీటర్లు, చౌదాపూర్‌లో 3.58, మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా బాచుపల్లిలో 4.06, రంగారెడ్డి జిల్లా మాడ్గులలో 4.44, వనపర్తి జిల్లా రేవెల్లిలో 3.38, పన్గల్‌లో 2.72, జోగుళాంబ గద్వాల జిల్లా అ లంపూర్‌లో 2.56, యాదాద్రి-భువనగిరి జిల్లాలో 2.48సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

# రెవెన్యూ శాఖలో భూ దందా కలకలం

- డిప్యూటీ కలెక్టర్ రాము నాయిక్‌పై సస్పెన్షన్ వేటు

హైదరాబాద్,జూన్8 (ప్రజా వీక్షణం)

తెలంగాణ రెవెన్యూ శాఖలో భూ దందా కలకలం రేపుతోంది. ఈ వ్యవహారంలో డిప్యూటీ కలెక్టర్ రాము నాయిక్‌పై సస్పెన్షన్ వేటు పడింది. హౌసింగ్ బోర్డు భూముల పరిశీలన సమయంలో రాము నాయిక్ చేసిన భారీ అక్రమాలు బయటపడ్డాయి. బహిరంగ మార్కెట్‌లో గజం రూ.2 లక్షలకు పైగా విలువ చేసే హైకోర్టు 5-6 గేట్ల మధ్య ఉన్న తెలంగాణ హౌసింగ్ బోర్డుకు చెందిన 33.53 చదరపు గజాల స్థలాన్ని రాము నాయిక్ 2018 ఫిబ్రవరి 17న అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించినట్లు అధికారులు తేల్చారు. ఇందిరమ్మ ఇండ్ల స్థలాల పరిశీలనలో అనేక అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ప్రభుత్వ భూములను కాజేయడంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భూ దందాలకు పాల్పడిన అధికారులపై ఉక్కుపాదం మోపుతామని, ప్రభుత్వ ఆస్తులను దోచుకునేవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. రాము నాయిక్‌పై 2016 నుంచే వివిధ కేసులు ఉన్నట్లు తెలుస్తోంది. విజయనగర్ కాలనీ భూ వ్యవహారాలు, తుల్జాగూడ, లక్ష్మీగూడ, మహబూబ్‌గంజ్ ప్రాంతాల్లోని భూముల అక్రమ రిజిస్ట్రేషన్లపై అధికారులు విచారణను ముమ్మరం చేశారు. సబ్ రిజిస్ట్రార్ల పాత్రపై కూడా దర్యాప్తు జరుగుతోంది. అక్రమ సేల్ డీడ్‌లను రద్దు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. భూ దందాలకు సహకరించిన ఓ సూపరింటెండెంట్‌ను రెవెన్యూ శాఖ డిస్మిస్ చేసింది. మరో సూపరింటెండెంట్ బోనా నాయక్‌పై సస్పెన్షన్ వేటు పడింది. భూకబ్జాలపై అధికారులు ప్రత్యేక నిఘా పెట్టగా.. తీగ లాగితే డొంక కదిలినట్లు భూ దందాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి.

# రవాణాశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ కట్టుదిట్టం

- అధికారులతో సమీక్షలో మంత్రి పొన్నం వెల్లడి

హైదరాబాద్,జూన్8 (ప్రజా వీక్షణం)

ప్రయాణికుల భద్రతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలో రవాణా శాఖ ఉన్నతాధికారులతో మంత్రి పొన్నం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా రవాణా శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను మరింత కట్టుదిట్టం చేస్తామన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓవర్ లోడింగ్, ఫిట్‌నెస్ లేని వాహనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. అలాగే పన్నులు చెల్లించని వాహనాలకు భారీ జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు. అవసరమైతే వాహనాల సీజ్‌కు ఆదేశాలు ఇస్తామన్నారు. ఉమ్మడి జిల్లాల వారీగా 10 ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర స్థాయిలో రెండు స్పెషల్ స్క్వాడ్‌ల ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. స్కూల్ బస్సులు, మినీ వ్యాన్‌లకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాల్సిందేనని తెలిపారు. సామర్థ్యానికి మించి విద్యార్థులను రవాణా చేస్తే.. అలాంటి వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల పన్నులు ఎగ్గొట్టే వాహనాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని చెప్పారు. స్లీపర్ బస్సుల్లో నిబంధనల ఉల్లంఘనలకు ఇకపై చెక్ పెడతామన్నారు. త్రైమాసిక పన్నులు చెల్లించని వాహన యజమానులపై భారీ జరిమానాలు విధించడంతో పాటు అవసరమైతే వాహనాలను సీజ్ చేయాలని పేర్కొన్నారు. అలాగే ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని స్లీపర్ బస్సుల్లో నిబంధనల ఉల్లంఘనలను ఏమాత్రం ఉపేక్షించవద్దని, ఉల్లంఘనలు గుర్తించిన వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. సమీక్షా సమావేశంలో స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్,రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, అడిషనల్ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ రమేష్, జెటిసి చంద్రశేఖర్ గౌడ్,డిటిసి రవీందర్ కుమార్, వెంకట రమణ, సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నీట్ రీ ఎగ్జామ్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

- పేపర్ తయారీ నుంచి, ప్రింటింగ్ వరకు సీక్రసీ

- పేపర్ తయారీదారులంతా రహస్య ప్రదేశానికి తరలింపు

న్యూఢిల్లీ,జూన్8 (ప్రజా వీక్షణం)

మే 3న జరిగిన నీట్ పరీక్షలో పేపర్ లీకేజీ వివాదం దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జూన్ 21న దేశవ్యాప్తంగా నిర్వహించబోయే రీ టెస్ట్‌ను అత్యంత పారదర్శకంగా, లీకులకు ఏమాత్రం తావులేకుండా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ మునుపెన్నడూ లేని విధంగా ఒక అసాధారణ భద్రతా వ్యూహాన్ని సిద్ధం చేశాయి. ఈసారి క్వశ్చన్ పేపర్లు లీక్ అవ్వకుండా ఉండేందుకు ఏకంగా భారత వైమానిక దళం సహాయం తీసుకోనున్నారు. ఈ మేరకు రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, సమాచార శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా మధ్య జరిగిన ఒక ఉన్నత స్థాయి సమావేశంలో ఈ వ్యూహంపై సుదీర్ఘంగా చర్చించారు. గతంలో క్వశ్చన్ పేపర్లను ప్రింటింగ్ ప్రెస్ నుంచి పరీక్ష కేంద్రాలకు తరలించే రవాణా సమయంలోనే లీకేజీ ముఠాలు చేతివాటం ప్రదర్శించినట్లు దర్యాప్తులో తేలింది. ఈ లోపాన్ని సరిదిద్దడానికి.. ప్రధానమంత్రి కార్యాలయం పర్యవేక్షణలో సరికొత్త చర్యలు చేపడుతున్నారు. దీని ప్రకారం.. క్వశ్చన్ పేపర్లను అత్యంత సురక్షితమైన ఎయిర్‌ఫోర్స్ విమానాలు, హెలికాప్టర్ల ద్వారా దేశంలోని వివిధ ప్రాంతాలకు తరలిస్తారు. దీనివల్ల రవాణాలో జరిగే ఆలస్యం తగ్గడమే కాకుండా.. అనధికారిక వ్యక్తులు క్వశ్చన్ పేపర్లను తాకే అవకాశం కూడా ఉండదు. ఈసారి భద్రతను ఏ స్థాయిలో పటిష్టం చేశారంటే.. క్వశ్చన్ పేపర్లను తయారు చేసే నిపుణులు, మోడరేటర్లు, అనువాదకులను పరీక్ష జరిగే జూన్ 21వ తేదీ వరకూ ఒక రహస్య ప్రాంతంలో పూర్తిగా నిర్బంధంలో ఉంచారు. బయటి ప్రపంచంతో వారికి ఎలాంటి సంబంధాలు లేకుండా కఠిన నిఘా ఏర్పాటు చేశారు. క్వశ్చన్ పేపర్ల బాక్సులకు హైటెక్ జీపీఎస్ ట్రాకింగ్ సిస్టమ్స్ ఏర్పాటు చేస్తున్నారు. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థుల బయోమెట్రిక్ గుర్తింపును పకడ్బందీగా పరిశీలిస్తారు. రీ-ఎగ్జామ్‌కు ముందు సోషల్ మీడియాలో నకిలీ పేపర్లు అమ్ముతూ విద్యార్థులను మోసం చేసే ముఠాలపై కఠిన చర్యలు తీసుకునేందుకు.. మరోవైపు సైబర్ విభాగాన్ని రంగంలోకి దించారు. గతంలో జరిగిన తప్పుల కారణంగా పరీక్ష రద్దయినందున, ఈ రీ-టెస్ట్ కోసం హాజరయ్యే విద్యార్థుల నుంచి ఎలాంటి అదనపు ఫీజు వసూలు చేయడం లేదని విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పష్టం చేశారు. దీనికి అయ్యే పూర్తి ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని, అభ్యర్థులు ఎలాంటి వదంతులను నమ్మకుండా ప్రశాంతంగా పరీక్షకు సిద్ధం కావాలని ఎన్టీఏ కోరింది. మరో రెండు వారాల్లో నీట్ యూజీ 2026 రీ-ఎగ్జామినేషన్ జరగనుంది. పేపర్ లీక్ ఆరోపణలతో ఇప్పటికే ఓసారి పరీక్షను రద్దు చేయడంతో రీ-టెస్ట్ నిర్వహణ విషయంలో ఎన్టీఏ అత్యంత అప్రమత్తతతో వ్యవహరిస్తోంది. పేపర్ తయారీ దశ నుంచే కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. రీ-ఎగ్జామ్ ప్రశ్నపత్రాల తయారీలో పాల్గొన్న నిపుణులను రహస్య ప్రదేశంలో లాక్‌డౌన్‌లో ఉంచినట్లు తెలుస్తోంది. ఈమేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. నీట్ యూజీ పేపర్ తయారుచేసిన నిపుణులు, పర్యవేక్షకులు, ట్రాన్స్‌లేటర్లు సహా ఈ ప్రక్రియలో భాగస్వాములైన ప్రతిఒక్కరినీ ప్రస్తుతం అత్యంత భద్రత కలిగిన రహస్య ప్రాంతంలో ఉంచినట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి. వీరిపై భద్రతా అధికారులు నిరంతర పర్యవేక్షణ ఉంచారని తెలిపాయి. మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌వాచీలు, ఇతర కమ్యూనికేషన్ పరికరాలేవీ వీరికి అందుబాటులో ఉంచలేదట. కేవలం అనుమతి పొందిన సిబ్బందికి మాత్రమే ఈ ప్రాంగణంలోకి ప్రవేశం కల్పిస్తున్నారు. జూన్ 21న నీట్ రీ-ఎగ్జామ్ పూర్తయ్యేంతవరకు వీరు ఈ లాక్‌డౌన్‌లోనే ఉండనున్నట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి. పేపర్ తయారీ నుంచి ప్రింటింగ్, ప్యాకేజింగ్, స్టోరేజీ, రవాణా, పంపిణీ వరకు అన్ని దశల్లో బహుళ అంచెల భద్రతా వ్యవస్థను అమలుచేస్తున్నారు. పేపర్ రవాణా కోసం వాయుసేన విమానాలను వినియోగించనున్నారంట. ఇదిలాఉండగా.. రీ-ఎగ్జామ్ పేపర్ సైతం లీక్ అయిందంటూ ఇటీవల వార్తలు వచ్చాయి. దీన్ని ఎన్టీఏ తీవ్రంగా ఖండించింది. సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ఈ దుష్ప్రచారం అవాస్తవం, మోసపూరితమని పేర్కొంది. అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, మోసగాళ్ల మాటలు నమ్మొద్దని విజ్ఞప్తి చేసింది. జూన్ 21న దేశవ్యాప్తంగా 551 నగరాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి 5.15 వరకు నీట్ యూజీ రీ-ఎగ్జామినేషన్ జరగనుంది.

# పరీక్షలంటే తెలియని వారు విమర్శలా

- విద్యార్థులకు జగన్ క్షమాపణలు చెప్పాలి

- ఇక్కడ చాలదన్నట్లు తెలంగాణలోనూ భూ కబ్జాలు

- జగన్ తీరుపై మండిపడ్డ సిఎం చంద్రబాబు

భీమవరం,జూన్8 (ప్రజా వీక్షణం)

నా దగ్గర తోక జాడిస్తే చూస్తూ ఊరుకోను. నేను సీఎంగా ఉన్నంతవరకు ఎవరు తప్పు చేసినా వదిలిపెట్టనని సిఎం చంద్రబాబు హెచ్చరించారు. సిద్ధాంతంలో పట్టాదారు పుస్తకాల జారీ కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గొడ్డలి పార్టీవి అన్నీ తప్పుడు ప్రచారాలే. నిరుద్యోగులను మోసం చేసిన చరిత్ర వైసీపీది. నిరుద్యోగులకు క్షమాపణ చెప్పాకే జగన్ రాజకీయాలు చేసుకోవాలని హెచ్చరించారు. వివేకాను చంపి.. నా చేతిలో గొడ్డలి పెట్టారు. జగన్ వంటివారికి ఎప్పటికప్పుడు బుద్ధి చెప్పాలి. పరీక్షలు అంటే తెలియనివాళ్లు విమర్శలు చేస్తున్నారని అంటూ సీఎం దుయ్యబట్టారు. తెలంగాణలోనూ వైసీపీ నేతలు భూములను కాజేయాలని చూశారని సీఎం తెలిపారు. ఇక్కడ చాలదన్నట్లు.. తెలంగాణలోనూ కబ్జాలు చేస్తున్నారని ఆరోపించారు. కోడికత్తి డ్రామాలు చేసేవారికి రైతుల బాధలు తెలియవన్నారు. తిరుమల దేవదేవుడి అంశంలోనూ ద్రోహం చేశారని మండిపడ్డారు. కలియగ దైవం వేంకటేశ్వర స్వామిని అపవిత్రం చేశారన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే దుర్మార్గులను దూరం పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. గత ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల అప్పులు చేసిందని విమర్శించారు. ఒక్క పరిశ్రమ రాలేదని.. యువతకు ఉద్యోగాలు లేకుండా చేశారని మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో భూ రికార్డులు తారుమారు కావడం వల్ల అనేక వివాదాలు తలెత్తాయి. ఒకప్పుడు బ్రిటిష్ కాలం నుంచి కొనసాగిన పటిష్టమైన భూ రికార్డుల వ్యవస్థ కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో రెవెన్యూ సమస్యలు తక్కువగా ఉండేవి. కానీ గత పాలకుల నిర్వాకంతో భూ యాజమాన్య సమస్యలు పెరిగిపోయాయి. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరిట తీసుకొచ్చిన చట్టం రైతుల భూములపై అనిశ్చితి సృష్టించింది. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ చట్టాన్ని రద్దు చేసి రైతుల యాజమాన్య హక్కులను కాపాడామని వివరించారు.

# విశాఖ స్టీల్‌లో భారీ ప్రమాదం

- ద్రవరూప స్టీల్ లిక్విడ్ పడి మంటలు- 9మంది కార్మికుల దుర్మరణం

- ఏడుగురికి తీవ్ర గాయాలు..ఆస్పత్రికి తరలింపు

- మంటలు చెలరేగడంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం

- ఘటన జరిగిన వెంటనే కార్మికులు, ఉద్యోగుల పరుగు

- ఘటనపై సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి..అధికారులతో ఆరా

- హుటాహుటిన విశాఖ బయల్దేరిన హోంమంత్రి అనిత

విశాఖపట్నం,జూన్8 (ప్రజా వీక్షణం)

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సోమవారం స్టీల్‌ప్లాంట్‌లోని ఎస్ఎంఎస్-2, ఎస్‌టీసీ-3 హీట్ ఎఫ్‌జీలో స్టీల్ మెటల్ లిక్విడ్ లాడిల్ పేలడంతో ఉక్కుద్రవం లీకై మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో తొమ్మిది మంది కార్మికులు మృతి చెందగా.. పలువురు గాయపడ్డారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. 1,500 డిగ్రీల వేడితో స్టీల్ మెటల్ లిక్విడ్ ల్యాడిల్ ద్వారా ఉక్కుద్రవాన్ని లిఫ్ట్ చేస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాదం సంభవించడంతో భయాందోళనకు గురైన కార్మికులు, ఉద్యోగులు బయటకు పరుగులు తీశారు. అగ్నిప్రమాక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని మంటలు ఆర్పేందుకు యత్నిస్తున్నారు. మెటల్ ల్యాడల్ నుంచి బకెట్లు కుప్పకూలాయి. ల్యాడల్‌లో ఉన్న ద్రవ లోహం అకస్మాత్తుగా కిందపడటంతో అక్కడ పనిచేస్తున్న కార్మికులు ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో ప్రమాదస్థలిలో 9 మంది కార్మికులు మృతిచెందగా, మరో ఏడుగురికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య పెరుగుతున్నట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే ప్లాంట్ యాజమాన్యం అత్యవసర భద్రతా చర్యలు చేపట్టింది. గాయపడిన కార్మికులను వెంటనే సమీప ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో ప్లాంట్‌లో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు విచారణ ప్రారంభించారు. ల్యాడల్‌లోని ద్రవ లోహం ఎందుకు కిందపడింది?, సాంకేతిక లోపమా? లేక భద్రతా ప్రమాణాల్లో ఏవైనా నిర్లక్ష్యం జరిగిందా? అనే కోణాల్లో అధికారులు దర్యాప్తు చేపట్టారు. సంఘటన స్థలాన్ని ఉన్నతాధికారులు పరిశీలించి పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. అధికారిక నివేదిక వచ్చిన తర్వాతే గాయపడిన వారి సంఖ్య, మరణాల వివరాలు, ప్రమాదానికి గల అసలు కారణాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. ఈ ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద వివరాలపై అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. కార్మికుల మృతిపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అలాగే అన్నిశాఖలు సమన్వయంతో పనిచేసి సహాయక చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదానికి గల కారణాలను సమగ్రంగా విచారించాలని చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత ఈ ప్రమాదంపై వెంటనే స్పందించారు. విశాఖ జిల్లా కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు, ప్రమాద స్థలంలో సహాయక చర్యలను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. విజయనగరం పర్యటనలో ఉన్నప్పటికీ, ప్రమాద సమాచారం అందిన వెంటనే హుటాహుటిన ఘటనా స్థలానికి హోంమంత్రి బయలుదేరారు.



# చరిత్ర సృష్టించిన భారత్

**భారత్ చేతిలో చిత్తుచిత్తుగా ఓడిన అఫ్ఘనిస్థాన్.. ఇన్నింగ్స్ 300 పరుగుల తేడాతో భారీ విజయం!భారత స్పిన్‌కు అఫ్గాన్ ఆటగాళ్లు కాకావికాలంతొలి ఇన్నింగ్స్‌లో 152 పరుగులకు ఆలౌట్‌రెండో ఇన్నింగ్స్‌లో 112 పరుగులకే ప్యాకప్ఏడు వికెట్లతో సత్తాచాటిన మానవ్ సుతార్ నిప్పులు చెరిగిన కుల్దీప్, వాషింగ్టన్ సుందర్**

ముల్లాన్‌పూర్ వేదికగా జరిగిన ఏకైక టెస్టులో అఫ్ఘనిస్థాన్ జట్టు చిత్తు చిత్తుగా ఓడింది. తొలి ఇన్నింగ్స్‌లో 152 పరుగులకు ఆలౌట్ అయిన అఫ్ఘన్.. రెండో ఇన్నింగ్స్‌లో 112 పరుగులకే ముగించింది. టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 564/8 పరుగులు చేయడంతో.. ఈ టెస్టులో భారత్ ఇన్నింగ్స్ 300 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ టెస్టుతో డెబ్యూ చేసిన మానవ్ సుతార్ ఓవరాల్‌గా ఏడు వికెట్లు తీసుకుని సత్తా చాటాడు. భారత్ – అఫ్ఘనిస్థాన్ మధ్య జరిగిన ఏకైక టెస్టులో టీమిండియా ఘన విజయం సాధించింది. మూడు రోజుల్లో ముగిసిన ఈ టెస్టులో టీమిండియా ఆధిపత్య ధోరణి ప్రదర్శించింది. ఆరంభం నుంచి ఏకపక్షంగా సాగిన ఈ టెస్టులో టీమిండియా ఇన్నింగ్స్ 300 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. డబ్ల్యూటీసీ ఛాంపియన్ షిప్ 2025 –27లో టీమిండియాకు ఈ విజయం చాలా సపోర్ట్ ఇవ్వనుంది. ముల్లాన్‌పూర్ వేదికగా జరిగిన ఈ టెస్టులో మూడో రోజు అఫ్ఘనిస్థాన్ రెండుసార్లు ఆలౌట్ అయింది. తొలి ఇన్నింగ్స్‌లో 113/5తో మూడో రోజు ఆట మొదలుపెట్టిన అఫ్ఘనిస్థాన్.. మొదటి సెషన్‌లోనే 152 పరుగులకే ఆలౌట్ అయింది. ఫాలో ఆన్ ప్రారంభించిన అఫ్ఘనిస్థాన్ లంచ్ బ్రేక్‌కి ముందు ఎలాంటి వికెట్లు కోల్పోలేదు. లంచ్ బ్రేక్ తర్వాత టీమిండియా పేసర్ మొహమ్మద్ సిరాజ్ తొలి వికెట్ తీసుకోగా.. ఆ తర్వాత వాషింగ్టన్ సుందర్ అఫ్ఘనిస్థాన్ బ్యాటర్లను పెవిలియన్‌కు క్యూ కట్టించాడు. ఓపెనర్ సెడికుల్లా అటల్ క్రీజులో ఉన్నంత సేపు కొంచెం పోరాడిన అఫ్ఘనిస్థాన్ ఆ తర్వాత నుంచి కుప్పకూలింది. దాంతో మూడో రోజు ఆట మిగిలుండగానే అఫ్ఘనిస్థాన్ కేవలం 112 పరుగులకే ఆలౌట్ అయింది. అఫ్ఘనిస్థాన్ బ్యాటర్లలో సెడికుల్లా అటల్ 42, రహ్మానుల్లా గుర్బాజ్ 24, రహ్మత్ షా 13 పరుగులు చేయగా.. మిగతా అందరూ సింగిల్ డిజిట్‌కే పెవిలియన్ బాట పట్టారు. భారత బౌలర్లలో సుందర్ 4, కుల్దీప్ 3, మానవ్ సుతార్ 1, సిరాజ్ 1 వికెట్ పడగొట్టారు. అంతకు ముందు తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 127 ఓవర్లు ఆడి 8 వికెట్ల నష్టానికి 564 పరుగులు చేసి డిక్లేర్ ఇచ్చింది.

## టెస్ట్ డెబ్యూ లోనే మానవ్ సుతార్ హిస్టారికల్ రికార్డ్..





ఇండియా వర్సెస్ అఫ్గానిస్తాన్ ఏకైక టెస్ట్ మ్యాచ్ సెకండ్ డే ఆటలో ఒక వండర్‌ఫుల్ సీన్ కనిపించింది. టీమిండియా యంగ్ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ మానవ్ సుతార్ డెబ్యూ మ్యాచ్ లోనే అద్భుతమైన ఇంపాక్ట్ చూపించాడు. న్యూ చండీగఢ్ లోని ముల్లాన్‌పూర్ స్టేడియంలో జరుగుతున్న ఈ మ్యాచ్ లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ టీ టైమ్ కంటే జస్ట్ ముందే బాల్ ను సుతార్ కు ఇచ్చాడు. క్రీజులోకి వచ్చిన ఈ 23 ఏళ్ల యంగ్ ప్లేయర్ కేవలం నాలుగు బాల్స్ లోనే తన టాలెంట్ ఏంటో ప్రూవ్ చేసుకున్నాడు.మానవ్ సుతార్ వేసిన ఫస్ట్ ఓవర్ ఫోర్త్ బాల్ కు అఫ్గాన్ ఓపెనర్ అబ్దుల్ మాలిక్ స్వీప్ షాట్ కొట్టడానికి ట్రై చేశాడు. అయితే బాల్ టాప్ ఎడ్జ్ అయి గాల్లోకి లేవగా, బ్యాక్‌వర్డ్ స్క్వేర్ లెగ్ నుంచి మొహమ్మద్ సిరాజ్ ముందుకు డైవ్ చేస్తూ ఒక షార్ప్ క్యాచ్ ను అందుకున్నాడు. ఈ వికెట్ పడగానే టీమిండియా ప్లేయర్స్ అందరూ సుతార్ ను హగ్ చేసుకుంటూ గ్రాండ్ గా సెలబ్రేట్ చేసుకున్నారు. ఈ సాలిడ్ బ్రేక్‌త్రూతో సుతార్ తన కెరీర్ లోనే మర్చిపోలేని మెమరబుల్ మూమెంట్ ను సొంతం చేసుకున్నాడు. ఇండియా టెస్ట్ క్రికెట్ హిస్టరీలో డెబ్యూ మ్యాచ్ లోనే ఫస్ట్ ఓవర్ లో వికెట్ తీసిన ఎనిమిదో ఇండియన్ క్రికెటర్ గా మానవ్ సుతార్ సరికొత్త రికార్డ్ క్రియేట్ చేశాడు. దాదాపు 8 దశాబ్దాల చరిత్ర ఉన్న ఈ అరుదైన క్లబ్ లో ఇంతకుముందు మొంటు బెనర్జీ (1948), మనోహర్ హార్డికర్ (1958), వామన్ కుమార్ (1961), చేతన్ శర్మ (1984), డబ్ల్యూవీ రామన్ (1988), నిలేష్ కుల్కర్ణి (1997), టిను యోహానన్ (2001) మాత్రమే ఉన్నారు. 2001 లో ఇంగ్లాండ్ పై టిను యోహానన్ ఈ ఫీట్ సాధించిన తర్వాత మళ్లీ 25 ఏళ్ల వరకు ఏ ఇండియన్ బౌలర్ కూడా ఫస్ట్ ఓవర్ లో వికెట్ తీయలేదు. ఆ రికార్డును సుతార్ ఇప్పుడు రిపీట్ చేశాడు. స్పిన్ ఆల్ రౌండర్ హర్ష్ దూబేను పక్కన పెట్టి మానవ్ సుతార్ ను టీమ్ లోకి తీసుకోవడం పర్ఫెక్ట్ డెసిషన్ అని సుతార్ నిరూపించాడు. మ్యాచ్ స్టార్ట్ కావడానికి ముందు సీనియర్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ చేతుల మీదుగా సుతార్ టెస్ట్ క్యాప్ నంబర్ 319 ను అందుకున్నాడు. 2021 లో అక్షర్ పటేల్ డెబ్యూ చేసిన తర్వాత టీమిండియా తరఫున టెస్ట్ ఫార్మాట్ లో ఎంట్రీ ఇచ్చిన ఫస్ట్ స్పెషలిస్ట్ స్పిన్ బౌలింగ్ ఆల్ రౌండర్ గా మానవ్ సుతార్ నిలిచాడు.




## బౌలర్లు అలసిపోకపోవడంతోనే ఫాలో ఆన్ ఆడించాం

## టీమిండియా టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్

తమ బౌలర్లు అలసిపోకపోవడంతోనే అఫ్గానిస్థాన్‌ను ఫాలో ఆన్ ఆడించామని టీమిండియా టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తెలిపాడు. ప్రస్తుతం భారత టెస్ట్ టీమ్ సంధి దశలో ఉందని, పరిస్థితులకు తగ్గట్లు బ్యాటింగ్ విభాగంలో మార్పులు ఉంటాయని చెప్పాడు. ముల్లాన్‌పూర్ వేదికగా సోమవారం ముగిసిన ఏకైక టెస్ట్‌లో భారత్ ఇన్నింగ్స్ 300 పరుగుల భారీ తేడాతో అఫ్గాన్‌ను చిత్తు చేసింది. ఈ మ్యాచ్ అనంతరం మాట్లాడిన గిల్.. ఇది సంపూర్ణ విజయమని తెలిపాడు. 'ఇది ఒక సంపూర్ణమైన విజయం. మూడు విభాగాల్లో రాణించాం. అందుకే ఈ విజయం చాలా సంతోషాన్నిచ్చింది. వాతావరణం చాలా వేడిగా ఉంది. లంచ్‌కు ముందు లేదా మొదటి డ్రింక్స్ విరామం తర్వాతే వారిని ఆలౌట్ చేస్తే.. మా బౌలర్లు అలసిపోకుండా ఉన్నారో లేదో చూసి ఫాలో–ఆన్ ఇవ్వాలని నిర్ణయించుకున్నాం. ఒకవేళ అలా కాకపోతే.. మేం ఒక రెండు సెషన్ల పాటు బ్యాటింగ్ చేసి.. చివర్లో అఫ్గాన్‌కు బ్యాటింగ్ అప్పగించాలని అనుకున్నాం. కానీ మాకు వేగంగా వికెట్లు దక్కాయి. దాంతో మ్యాచ్‌పై పట్టు సాధించాం. అలాగే మా ఫాస్ట్ బౌలర్లు బౌలింగ్ చేసిన తీరు కూడా అద్భుతం. మేం ఫాలో–ఆన్ ఇచ్చినప్పుడు సిరాజ్ కీలకమైన వికెట్ అందించాడు. తొలి ఇన్నింగ్స్‌లో ప్రసిద్ధ్ మూడు ముఖ్యమైన వికెట్లు తీశాడు.మానవ్ సుతార్, వాషింగ్టన్, కుల్దీప్‌ల నైపుణ్యం, నాణ్యతపై మాకు ఎలాంటి సందేహం లేదు.


## టీమిండియాపై నోరుపారేసుకున్న ఖుష్‌దిల్ షా



దాయాది జట్లు భారత్, పాక్ దేశాల మధ్య జరిగే క్రికెట్ సమరం కేవలం ఆట మాత్రమే కాదు.. అది కోట్ల మంది అభిమానుల భావోద్వేగాలతో ముడిపడి ఉన్న ఓ మహా సంగ్రామం. ఇలాంటి హై–వోల్టేజ్ మ్యాచ్‌ల గురించి ఏ చిన్న వివాదాస్పద కామెంట్ వచ్చినా అది క్షణాల్లో సంచలనంగా మారుతుంది. తాజాగా పాకిస్థాన్ ఆల్‌రౌండర్ ఖుష్‌దిల్ షా భారత్–పాక్ మ్యాచ్‌లపై చేసిన కొన్ని వివాదాస్పద కామెంట్లు క్రికెట్ ప్రపంచంలో కొత్త చర్చకు తెరలేపాయి. భారత్‌తో జరిగే మ్యాచ్‌లలో అంపైరింగ్ నిర్ణయాలతో పాటు చాలా విషయాలు భారత జట్టుకే అనుకూలంగా వెళ్తాయంటూ ఆయన సంచలన ఆరోపణలు చేశాడు.ఓ పాడ్‌కాస్ట్‌లో తన తోటి ఆటగాడు అబ్బాస్ అఫ్రిదితో కలిసి మాట్లాడిన ఖుష్‌దిల్ షా, భారత్–పాకిస్థాన్ మ్యాచ్‌ల సమయంలో ఉండే ఒత్తిడి, భావోద్వేగాల గురించి పంచుకున్నాడు. "భారత్‌తో మ్యాచ్ అంటే ఇరువైపులా ఎమోషన్స్ వేరే లెవెల్‌లో ఉంటాయి. ప్రారంభంలో తీవ్రమైన ఒత్తిడి ఉన్నప్పటికీ, మ్యాచ్ సాగుతున్న కొద్దీ అది తగ్గిపోతుంది. మా కాలంలో మేము కూడా భారత్‌ను ఓడించాము, మంచి పోటీ ఇచ్చాము" అని ఖుష్‌దిల్ పేర్కొన్నాడు.అయితే ఈ చర్చ సాగుతుండగానే ఖుష్‌దిల్ షా సోషల్ మీడియాలో చర్చనీయాంశమైన ఓ కామెంట్ చేశాడు. "భారత్‌తో మ్యాచ్ జరిగేటప్పుడు మైదానంలో చాలా విషయాలు వారికే అనుకూలంగా మారుతాయి. అంపైరింగ్ నిర్ణయాలు కూడా భారత్‌కే ఫేవరెట్‌గా వస్తాయి. అంతెందుకు, డ్రెస్సింగ్ రూమ్‌కు సంబంధించిన కొన్ని నిర్ణయాలు, అలాగే మ్యాచ్‌ల నిర్వహణ సైతం వారి ఇష్టప్రకారమే జరుగుతున్నట్లు అనిపిస్తుంది" అని ఖుష్‌దిల్ షా ఆరోపించాడు. అయితే తన ఆరోపణలకు మద్దతుగా ఆయన ఎలాంటి నిర్దిష్ట ఉదాహరణలను లేదా మ్యాచ్ సంఘటనలను ప్రస్తావించలేదు. ఈ వివక్షలన్నింటినీ అధిగమించి పాకిస్థాన్ భారత్‌పై గెలిచినప్పుడు ఆ విజయాలు ఇచ్చే మజానే వేరని అన్నాడు.ఈ పాక్ క్రికెటర్ కామెంట్లపై సోషల్ మీడియాలో నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. ఇటీవలి కాలంలో పాకిస్థాన్‌పై భారత్ సాధిస్తున్న వరుస విజయాల నిరాశతోనే ఇలాంటి కామెంట్స్ చేస్తున్నారని భారత అభిమానులు కొట్టిపారేస్తుండగా.. కొంతమంది పాక్ అభిమానులు మాత్రం ఖుష్‌దిల్‌కు మద్దతు తెలుపుతున్నారు. గత కొన్నేళ్లుగా భారత్, పాకిస్థాన్‌పై తిరుగులేని రికార్డును కలిగి ఉంది. 2022 సెప్టెంబర్ తర్వాత పాకిస్థాన్‌తో జరిగిన వరుస 6 మ్యాచ్‌లలోనూ టీమిండియానే విజయం వరించింది. వన్డేల్లో సైతం 2017 ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత పాకిస్థాన్ భారత్‌ను ఓడించలేకపోయింది. ఈ నేపథ్యంలో ఖుష్‌దిల్ షా చేసిన కామెంట్స్ క్రికెట్ వర్గాల్లో మరింత దుమారం రేపుతున్నాయి.

## గెలుపే నా టార్గెట్..

**నా కెప్టెన్సీ నాదే.. ఎవరి మాట నేను వినను ముంబై స్ట్రీట్ క్రికెట్ నుంచి చాలా నేర్చుకున్నా.. టీమిండియా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్**



ఇండియా టీ20 టీమ్ కొత్త కెప్టెన్ గా శ్రేయాస్ అయ్యర్ అఫీషియల్ గా అనౌన్స్ అయ్యాడు. సెలెక్షన్ కమిటీ మీటింగ్ లో 31 ఏళ్ల అయ్యర్ ను ఈ పొజిషన్ కు ఎంపిక చేశారు. మార్చి నెలలో ఇండియాకు టీ20 వరల్డ్ కప్ అందించి సక్సెస్ ఫుల్ గా నిలిచిన సూర్యకుమార్ యాదవ్ ప్లేస్ లో అయ్యర్ బాధ్యతలు తీసుకోబోతున్నాడు. ఈ కొత్త రెస్పాన్సిబిలిటీ పై శ్రేయాస్ అయ్యర్ స్పందిస్తూ, కెప్టెన్ అయ్యాను కదా అని తన పర్సనాలిటీ ని మార్చుకోవాల్సిన అవసరం లేదని చెప్పాడు. ఎవరి నీడలోనో ఉండటానికి తాను ఇష్టపడనని, ముంబై లో కఠినమైన క్రికెట్ ఎన్విరాన్ మెంట్ లో పెరిగిన పాత శ్రేయాస్ లాగే ఉంటానని స్పష్టం చేశాడు. ముంబై లో పెరగడం వల్ల చిన్నప్పటి నుంచి ఛాలెంజ్ లను ఫేస్ చేయడం అలవాట అయిందని అయ్యర్ ఒక ఈవెంట్ లో గుర్తు చేసుకున్నాడు. అక్కడ క్రికెట్ క్రేజ్ చాలా ఎక్కువని, స్ట్రీట్ లో ఆడే ప్రతి చిన్న పిల్లాడు ముంబై టీమ్ కు ఆడాలని కలలు కంటాడని చెప్పాడు.

ప్రజావీక్షణం
దినపత్రిక



## హీరోయిన్లను గ్రామరస్‌గా చూపడం అలవాటే

### ఇది టాలీవుడ్‌లోనే కొవె తక్కువని చెప్పాలి జాన్వీకపూర్ పై ట్రోల్స్‌కు స్పందించిన నిత్యామీనన్

'పెద్ది' సినిమా విడుదలైన తర్వాత జాన్వీ కపూర్ పాత్ర చుట్టూ నెలకొన్న వివాదం ఇంకా చర్చనీయాంశం గానే కొనసాగుతోంది. సినిమాలో హీరోయిన్‌ను మరింత గ్లామరస్‌గా చూపించారంటూ సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తడంతో ఈ అంశం పెద్ద చర్చకు దారి తీసింది. పలువురు నెటిజన్లు, సినీ ప్రముఖులు దర్శకులను ప్రశ్నిస్తుండగా, మరికొందరు జాన్వీ కపూర్‌కు మద్దతుగా నిలుస్తున్నారు. ఈ వివాదంలో ఇప్పటికే నటీమణులు ఆషికా రంగనాథ్, డింపుల్ హయతి సహా పలువురు హీరోయిన్లు స్పందించి, హీరోయిన్‌లను విమర్శించడం కంటే దర్శకులను ప్రశ్నించాలని అభిప్రాయపడ్డారు. తాజాగా ఈ అంశంపై నటి నిత్యా మీనన్ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. హీరోయిన్‌లను కేవలం గ్లామర్ కోణంలో చూపించడం ఒక్క తెలుగు సినీ పరిశ్రమకే పరిమితం కాదని, దాదాపు అన్ని చిత్ర పరిశ్రమల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోందని ఆమె అన్నారు. హీరోయిన్‌లను గ్లామర్ డాల్స్‌లా చూపించడం టాలీవుడ్‌లోనే ఎక్కువగా జరుగుతుందనడం సరైన అభిప్రాయం కాదు. ప్రతి ఇండస్ట్రీలోనూ ఇలాంటి పరిస్థితులు ఉన్నాయి. ప్రేక్షకులను ఆకర్షించడానికి గ్లామర్ అవసరమనే భావనతో కొంతమంది దర్శకులు, నిర్మాతలు వ్యవహరిస్తున్నారు. సినిమాలు మరింత కమర్షియల్ అవుతున్న కొద్దీ కొన్ని సందర్భాల్లో హద్దులు దాటే పరిస్థితులు ఏర్పడుతున్నాయని నిత్యా మీనన్ పేర్కొన్నారు. అయితే ఈ విషయంలో కేవలం దర్శకులనే తప్పుబట్టడం సరైంది కాదని కూడా ఆమె అభిప్రాయపడ్డారు. కొంతమంది హీరోయిన్లు గ్లామర్ పాత్రలను స్వీకరించడానికి సిద్ధంగా ఉంటారు.

## పెద్దిలో మంచి పాత్రను చేశా

### జాన్వీని ట్రోల్ చేయడం తగదన్న జగపతిబాబు



'పెద్ది' బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయి వసూళ్లతో దూసుకుపోతోంది. సినిమాలో కీలక పాత్ర పోషించిన సీనియర్ నటుడు జగపతిబాబు తాజాగా ఓ ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఈ చిత్రంలో 'అప్పలసూరి' పాత్రలో నటించిన జగపతిబాబు, 'పెద్ది' తన కెరీర్‌లో ఎంతో ప్రత్యేకమైన సినిమా అని పేర్కొన్నారు. మధ్యలో ఎన్నో సినిమాలు చేసినప్పటికీ, ఈ సినిమా విడుదల కోసం ప్రత్యేకంగా ఎదురుచూశానని తెలిపారు. చిత్రం విడుదల తర్వాత ఒక ప్రముఖ దర్శకుడు తనకు ఫోన్ చేసి, 'ఇంత గొప్ప పాత్ర చేసినా మీ గురించి పెద్దగా చర్చ జరగడం లేదు. ఇదే పాత్రను మరో భాష నటుడు చేసి ఉంటే ఇప్పటికే ఎన్నో అవకాశాలు వచ్చేవని చెప్పినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఇండస్ట్రీలో నటులకు లభించే గుర్తింపు గురించి కూడా జగపతిబాబు మాట్లాడారు. 'చాలా సందర్భాల్లో పరభాష నటులకు ఎక్కువ గౌరవం దక్కుతుంది. నేను ఇతర భాషల్లో పని చేసినప్పుడు కూడా అలాంటి ఆదరణను చూశాను. అయితే నాకు దానిపై ఎలాంటి అసంతృప్తి లేదు. కానీ 'పెద్ది' కోసం నేను ఎంత కష్టపడ్డానో నాకు తెలుసు' అని అన్నారు. షూటింగ్ సమయంలో తన పాత్రకు వచ్చిన స్పందనను గుర్తుచేసుకుంటూ, ప్రతి సన్నివేశం పూర్తయిన తర్వాత యూనిట్ సభ్యులు చప్పట్లు కొట్టేవారని చెప్పారు. సినిమా కోసం నా శక్తి మేరకు పనిచేశాను. అందుకే ఈ పాత్రకు మరింత గుర్తింపు రావాలని కోరుకోవడంలో తప్పేమీ లేదు. ఈ సినిమా కోసం నేను నా ప్రాణం పెట్టాను. అందుకే గుర్తింపు అడిగే హక్కు నాకు ఉంది. మిగతా సినిమాల విషయంలో నేను ఎప్పుడూ ఇలా మాట్లాడలేదు అని స్పష్టం చేశారు. ఇక 'పెద్ది'లో హీరోయిన్ జాన్వీ కపూర్ పాత్రపై సోషల్ మీడియాలో వస్తున్న విమర్శల గురించి కూడా జగపతిబాబు స్పందించారు. నటీనటులను వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని ట్రోలింగ్ చేయడం సరికాదని అన్నారు. జాన్వీ కపూర్ తనకు అప్పగించిన పాత్రను దర్శకుడు చెప్పిన విధంగానే చేసింది. ఒక పాత్ర లేదా కొన్ని సన్నివేశాలు ప్రేక్షకులకు నచ్చకపోవచ్చు. కానీ దాని కోసం నటిని వ్యక్తిగతంగా విమర్శించడం సరైంది కాదు. కొన్నిసార్లు మంచి ఉద్దేశంతో చేసిన అంశాలు కూడా ప్రేక్షకుల వద్ద ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవచ్చు. అంతమాత్రానికే ఒక ఆర్టిస్టును మానసికంగా ఇబ్బంది పెట్టేలా ట్రోల్ చేయడం మంచిది కాదు. ఈ విషయంలో నేను పూర్తిగా జాన్వీకి మద్దతు ఇస్తానని చెప్పారు.








## బాలకృష్ణపై భోలా బాలయ్య గీతం విడుదల

పని చేసేవాళ్లని ప్రపంచం ఇష్టపడుతుంది. పని చేయడమన్నా, సమాజ సేవ అన్నా బాలకృష్ణకు ఎక్కడ లేని ఉత్సాహం వస్తుంది. ఆయన అభిమానులు ఆ విషయాన్నే స్ఫూర్తిగా తీసుకుని ముందడుగు వేస్తుండడం అభినందనీయం అన్నారు ప్రముఖ దర్శకుడు బోయపాటి శ్రీను. ఆయన ముఖ్య అతిథిగా ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో భోళా బాలయ్య... పాట ఆవిష్కరణ వేడుక జరిగింది. అగ్ర కథానాయకుడు నందమూరి బాలకృష్ణ పుట్టినరోజుని పురస్కరించుకుని ఆయన వ్యక్తిత్వంపై రూపొందిన గీతమిది. పాట విడుదల అనంతరం బోయపాటి శ్రీను మాట్లాడుతూ 'తెరపై మంచి చేసే హీరోని చూసి వెళ్లిపోవడం కాదు. ఆయన చేసిన ఆ మంచిని స్ఫూర్తిగా తీసుకోవాలి. బాలకృష్ణ అభిమానులు ఆ దిశగానే సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. బాలకృష్ణ అంటే ఏమిటో నేను ఇప్పటికే సినిమాలతో చూపించా. ఆయన అభిమానులు ఏటా పుట్టినరోజు వేడుకని ఓ పండుగలా చేసుకుంటారు. భోళా బాలయ్య పాట చాలా బాగుంది' అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.బి.కె. హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు అనంతపురం జగన్, గీత రచయిత దివాకర్ అమిలినేని, గాయకుడు కరీముల్లా, సంగీత దర్శకుడు ఈశ్వర్ దత్తు తదితరులు పాల్గొన్నారు.

## పెద్ది కలెక్షన్ల సునామీ 300 కోట్ల వసూళ్లకు చేరువలో వసూళ్లు





మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కిన భారీ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన ప్రదర్శన కొనసాగిస్తోంది. విడుదలైన తొలి రోజు నుంచే రికార్డు స్థాయి వసూళ్లు సాధిస్తున్న ఈ చిత్రం, ప్రపంచవ్యాప్తంగా కలెక్షన్ల వర్షం కురిపిస్తూ ట్రేడ్ వర్గాలను ఆశ్చర్య పరుస్తోంది. విడుదలైన మొదటి రోజే 'పెద్ది' ప్రపంచవ్యాప్తంగా రూ. 135.36 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించి సంచలనం సృష్టించింది. ఆ తర్వాత రెండో రోజు రూ. 46.44 కోట్లు, మూడో రోజు రూ. 54.90 కోట్లు రాబట్టిన ఈ చిత్రం, తొలి మూడు రోజుల్లోనే రూ. 236.7 కోట్ల గ్రాస్ మార్క్‌ను దాటింది. ఆదివారం కూడా అదే జోరు కొనసాగించిన 'పెద్ది' మొదటి వీకెండ్ ముగిసే సరికి ప్రపంచవ్యాప్తంగా రూ. 292.5 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించినట్లు చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు సోషల్ మీడియాలో ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేస్తూ, సినిమాను 'బాక్సాఫీస్ ఛాంపియన్'గా అభివర్ణించింది. ముఖ్యంగా ఓవర్సీస్ మార్కెట్‌లో ఈ చిత్రం అద్భుతమైన స్పందనను అందుకుంటోంది. అమెరికా, ఆస్ట్రేలియా, యూకే వంటి కీలక మార్కెట్లలో రామ్ చరణ్‌కు ఉన్న క్రేజ్ మరోసారి ఈ వసూళ్ల ద్వారా స్పష్టమైంది. నాలుగు రోజుల్లోనే దాదాపు రూ. 300 కోట్లకు చేరువైన ఈ సినిమా, వీక్‌డేస్‌లో కూడా ఇదే స్థాయిలో కలెక్షన్లు కొనసాగిస్తే త్వరలోనే రూ. 500 కోట్ల క్లబ్‌లో చేరే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ 'అచ్చీయమ్మ' పాత్రలో నటించారు. కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్ కీలకమైన కోచ్ పాత్రలో కనిపించగా, జగపతిబాబు 'అప్పలసూరి'గా, దివ్యేందు శర్మ మరో ముఖ్యమైన పాత్రలో నటించారు.



## రామాయణంలో భాగం కావడం అదృష్టం: కాజల్

సినీప్రియులందరి దృష్టి ప్రస్తుతం 'రామాయణ' మీదే ఉంది. బాలీవుడ్‌లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రూపొందుతోన్న ఈ సినిమాలో రణ్‌బీర్ కపూర్.. రాముడి పాత్రలో, సీతగా సాయి పల్లవి నటిస్తున్న సంగతి తెలిసిందే. నితేశ్ తివారీ దర్శకత్వం వహిస్తున్నారు. విలక్షణ నటుడు యశ్.. రావణుడిగా కనిపించనున్నారు. ఆయన సతీమణి మండోదరి పాత్రలో కాజల్ నటించనున్నట్లు ఎప్పటినుంచో వార్తలు వస్తున్నాయి. తాజాగా ఆమె ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. ఓ అవార్డు వేడుకకు హాజరైన కాజల్ ఈ సినిమా గురించి మాట్లాడారు. తన కెరీర్లోనే ఇలాంటి బిగ్ ప్రాజెక్ట్ చేయడం మొదటిసారి అని అన్నారు. సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. భారీ స్థాయిలో 'రామాయణ' రానుంది. గతంతో నితేశ్ తివారీఈ చిత్రం గురించి మాట్లాడుతూ.. 5వేల సంవత్సరాలకు పైగా కోట్లాది హృదయాలను పాలిస్తున్న ఈ ఇతిహాసాన్ని తెర పైకి తీసుకురావడానికి దశాబ్దం నుంచి అన్వేషణ ప్రారంభించాం. మా చిత్రబృందం ఈ చిత్రం కోసం విశ్రాంతి తీసుకోకుండా పనిచేస్తూనే ఉంది. 2026 దీపావళికి మొదటి భాగం, 2027 దీపావళికి రెండో భాగాన్ని విడుదల చేయబోతున్నాం' అని అన్నారు. ఈ ఏడాది దీపావళికి మొదటి భాగం విడుదల కానుంది.

## గీతూమోహన్ దాస్‌కు టాక్సిస్ బృందం విషెస్




యశ్ హీరోగా తెరకెక్కుతోన్న చిత్రం 'టాక్సిక్' ..ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్' అనేది ఉప శీర్షిక. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. సోమవారం దర్శకురాలి పుట్టినరోజు సందర్భంగా షూటింగ్‌లో గీతూకు సంబంధించిన బీటీఎస్ వీడియోను చిత్ర బృందం విడుదల చేసింది. 'గుండెకు హత్తుకునేలా ఉన్న ప్రతి దృశ్యం వెనుక, మాటల కంటే మౌనమే ఎక్కువగా మాట్లాడిన ప్రతి క్షణం వెనుక.. ఆమె ఉంది' అని పేర్కొన్నారు. కియారా అద్వానీ, నయనతార కథానాయికలు.

Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL ) 9866330400 prajaveekshanam@gmail.com